ప్రజాశక్తి

మంగళవారం 11 నవంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

కరువు సీమకు
నేడు చంద్రబాబు రాక

- పీసీపల్లి సమీపంలో ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభించనున్న సిఎం
- కొత్త జిల్లా కాబోతున్న తరుణంలో అభివృద్ధిపై ఆకాంక్షలు
- అందరి ఆశలూ వెలిగొండపైనే..
- వచ్చే సీజన్‌కు నీరివ్వడం ముందున్న లక్ష్యం..
- పరిహారం కోసం నిర్వాసితుల ఎదురుచూపులు
- జిల్లాకిచ్చిన హామీలపైనే అందరి ఆశలు

సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

సిఎం చంద్రబాబు కనిగిరి నియోజకవర్గం, పీసీపల్లి సమీపంలో లింగన్నపాలెం వద్ద చిన్న, మధ్యతరహా పరిశ్రమల కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. ఇక్కడ నుంచే రాష్ట్రంలో చేపట్టిన పలు పార్కులను ఆయన వర్చువల్‌గా ప్రారంభించబోతున్నారు. హఠాత్తుగా కనిగిరి నియోజకవర్గంలో సిఎం చంద్రబాబు

▶ 2లో

బాపట్ల జిల్లాలో
నేడు కేంద్ర బృందం పర్యటన

▶ 5లో

రైతాంగాన్ని ఆదుకొనేందుకు కృషి

- క్షేత్ర స్థాయి నష్ట వివరాలు ప్రభుత్వానికి నివేదిస్తాం..
- ప్రకాశం జిల్లాలో పర్యటించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

'మొంథా' తుపాన్‌తో ప్రకాశం జిల్లాకు కలిగిన నష్టాన్ని అర్థం చేసుకోగలమని కేంద్ర బృందం తెలిపింది. క్షేత్రస్థాయిలో జరిగిన నష్టం గురించి ప్రభుత్వానికి నివేదిస్తామని, రైతాంగాన్ని ఆదుకొనేందుకు కృషి చేస్తామని కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి, సెంట్రల్ టీమ్ లీడర్ పి.పౌసుమి బసు భరోసా ఇచ్చారు. మొంథా తుపాన్‌తో జిల్లాలో జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులతో నియమించిన కమిటీ సోమవారం జిల్లాలో పర్యటించింది. కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి, పి.పౌసుమి బసు, ఆర్థిక మంత్రిత్వ శాఖ వ్యయ విభాగ డిప్యూటీ డైరెక్టర్ మహేష్ కుమార్, రాష్ట్ర రోడ్డు రవాణా, హైవేస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శశాంక్ శేఖర్ రాయ్, హైదరాబాద్

▶ 2లో

నాగులుప్పలపాడులో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

సెమినార్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

అమెరికా ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయాలి

మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

▶ 5లో

రైతాంగాన్ని ఆదుకొనేందుకు కృషి

(మొదటిపేజీ తరువాయి)

ఇస్రో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సైంటిస్ సాయి భగీరథ్ లతో పాటు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఒంగో లు వచ్చారు. ముందుగా స్థానిక ఎన్ఎస్‌పి అతిథి గృహానికి చేరుకున్న కేంద్ర బృందానికి కలెక్టర్ పి.రాజాబాబు, సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకష్ణ, డిఆర్ఓ బి.చిన ఓబులేసు స్వాగతం పలికి ప్రకాశం భవనానికి తీసుకొని వచ్చారు.

ఛాయచిత్ర ప్రదర్శన

తుపాన్ నష్టాలపై పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను కేంద్ర బృంద సభ్యులు తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఫొటో ఎగ్జిబిషన్‌కు సంబంధించిన వివరాలను కేంద్ర బృందానికి వివరించారు.

అన్ని విధాలుగా నష్టపోయిన రైతులు

మొంథా తుపాన్‌తో రైతులతో పాటు చేపలు, రొయ్యల చెరువులు సాగు చేస్తున్న వారు కూడా తీవ్రంగా నష్టపోయినట్లు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు, కేంద్ర బందానికి తెలిపారు. అల్లూరు, కొప్పోలు రొయ్యల చెరువులను కేంద్ర బందం పరిశీలిస్తుండగా తుపాన్ సమయంలో నెలకొన్న పరిస్థితి, వీటి సాగుదారులు నష్టపోయిన విధానాన్ని వారు వివరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను బందానికి ఎమ్మెల్యే దామచర్ల అందజేశారు. కార్యక్రమంలో ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్ పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన కేంద్ర బృందం

కొత్తపట్నం మండలం అల్లూరులోని వరి పొలాలను, నాగులుప్పల పాడులోని పత్తి, ఇతర పంటలను కేంద్ర బృందం సందర్శించింది. నీరు నిలిచిపోవడంతో వరిపంట వేళ్ళతో సహా కుళ్లిపోయిందని రైతులు వాపోయా రు. అంతా అనుకూలిస్తే సంక్రాంతి సమయానికి పంట చేతికొచ్చేదని, ఇప్పుడు పరిస్థితి తారు మారైపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులను ఆదుకోండి

కేంద్ర బృందం పిజిఆర్ఎస్ సమావేశ మందిరానికి వచ్చినప్పుడు సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్, రాష్ట్ర వ్యవసాయం మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఇతర ప్రజా సంఘాల నాయకులు కూడా కలిశారు. జిల్లాకు జరిగిన నష్టాన్ని కేంద్రం దష్టికి తీసుకువెళ్లి ఆదుకునే చూడాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ పి.రాజాబాబు, జెసి ఆర్.గోపాలకృష్ణ, డిఆర్ఒ బి.చిన ఓబులేసు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-గిద్దలూరు

అనారోగ్య పరిస్థితులతో ఆర్థికంగా సతమతమవుతున్న పేద ప్రజలకు 'ముఖ్యమంత్రి సహాయ నిధి' ఒక భరోసానిస్తుందని ఏపీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆర్థిక సమస్యలతో ఆరోగ్య చికిత్సకు ఇబ్బంది పడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 10వ విడతలో 74 మందికి, రూ.32,26,235 ఆయన మంజూరు చేయించారు. సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్య వచ్చినా ఎన్‌డియే ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఇప్పటి వరకు గిద్దలూరు నియోజకవర్గంలో 645 మందికి రూ.6 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందచేశామని, పేదలకు మేలు చేయటమే తమ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పంచాయతీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణకు ఆదరణ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్‌ఆర్సిపి ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణకు ప్రజల నుంచి అశేష స్పందన వస్తోందని వైసిపి ప్రకాశం జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని రాయవరం గ్రామంలో వైద్య కళాశాలల ప్రైవేటీకలను వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ అందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యతగా భావించిన నాటి సీఎం వైఎస్ జగన్, రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. వీటిని ప్రయివేటుకివ్వాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ వైఎస్సార్సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల పరిధిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

అమరవీరుల త్యాగాలు మర్చిపోలేం: ఎఫ్‌ఆర్‌వో

ప్రజాశక్తి-మార్కాపురం

అటవీశాఖలో అడవులతో పాటు వన్యప్రాణుల సంరక్షణ కోసం స్మగ్లర్లతో పోరాడి అటవీ సిబ్బంది ప్రాణ త్యాగాలు చేసిన ఉందతాలు మర్చి పోలేమని మార్కాపురం ఎఫ్ఆర్ఓ పిచ్చిరెడ్డి అన్నారు. స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో అటవీ అమరవీరుల దినోత్సవాన్ని సోమవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్థూపాన్ని పూలమాలతో అలంకరించారు. ఈ ప్రాంతానికి చెందిన నలుగురు అటవీ సిబ్బంది గతంలో స్మగ్లర్ల చేతిలో హతమయ్యారు. అమరులైన వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పిచ్చిరెడ్డి మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో అడవులకు, వన్య ప్రాణులకు స్మగ్లర్ల నుంచి హాని ఉందని సమాచారం అందిన సమయంలో పై అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

అమరవీరుల వారోత్సవాల్లో అటవీ అధికారులు

విషయం తెలిసిందని ఒంటరిగా అడవిలోకి వెళితే నష్టమే జరుగుతుందన్నారు. స్లగ్లర్ల ఆట కట్టించేందుకు సమిష్టిగా పథకం ప్రకారం వెళ్లాల్సి ఉందన్నారు. డివిజన్‌లోని అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

ఒరిజినల్ లింకు డ్యాకుమెంట్లు పోయినవి

మావులూరి మహేష్ బాబు, తండ్రి మాల్యాద్రి. నా ఆస్తికి సంబంధించిన కందుకూరు SROలో రిజిష్టర్ కాబడిన ఒరిజినల్ లింకు దస్తావేజు అయిన దస్తావేజు నెం. 596/2012 ఒంగోలు, సమతానగర్ ఇంటికి పోవుచుండగా మార్గమధ్యలో జారిపడిపోయినది. కావున సదరు ఒరిజినల్ దస్తావేజు ఎవరికైనను దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకి గాని, ఫోన్ నెంబర్‌కు గాని తెలియజేయవలసినదిగా కోరుచున్నాము.

ఇట్లు...**మావులూరి మహేష్‌బాబు**
తండ్రి మాల్యాద్రి, కందుకూరు,
SPSR నెల్లూరు జిల్లా. సెల్ : **7030299599**

ఒంగోలు 1వ అదనపు సివిల్ జడ్జి వారి కోర్టులో
(జూనియర్ డివిజన్)

EP No : 322/2023
in
OS No : 220/2017

బిట్వీన్
కోడెల సాంబశివరావు ....DHR
AND
బొల్లినేని అశోక్ కుమార్ (డైడ్)వగైరాలు ...JDRS

To.
4JDR) బొల్లినేని వేద శ్యామ్
S/o లేటు అశోక్ కుమార్,
R/o ఎనిక పాడు గ్రామం
సంతనూతలపాడు మండలం

పై నంబరు EPలో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ మీరు ముట్టనందున, కోర్టు వారు మీ నోటిసు నిమిత్తము తేది 28-11-2025కు వాయిదా వేశినారు, తేది 28-11-2025న మీరు పైన తెలిపిన కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ లేక లాయరు గారి ద్వారా గానీ హాజరు పడి మీ ఆక్షేపణలు తెలియచేయగలరు, లేని యడల మీపరోక్షమున కేసు తీర్మానము చేయబడునని తెలియచేయడమైనది.

వాయిదా తేది: 28-11-2025

// కోర్టు వారి అనుమతితో //

ఇట్లు
M.గంగాధర్‌రావు, B.A, BL.,
K.శివప్రసాదరావు, B.Sc, B.L.,
DHR తరపు అడ్వకేట్స్,ఒంగోలు
సెల్ : 9866729690

ఒంగోలు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి వారి కోర్టు లో
(సీనియర్ డివిజన్)

EP No : 38/2024.
in
OS No : 313/2014

రామా అనంత క్రిష్ణయ్య ..... DHR
మరియు
1.తన్నీరు నరసయ్య వగైరాలు ..JDRS

ప్రకటన

To
4th JDR) తన్నీరు ధనలక్ష్మి W/o శేషయ్య
12th JDR పారా అనూష, D/o బ్రహ్మయ్య,
4, మరియు 12 JDRs ల నివాసం : కొణిజేడు గ్రామం, టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా

మీకు పైన తెల్పిన EPలో ఎన్ని సార్లు నోటీసులు పంపిననూ ముట్టనందున, కోర్టు వారు మీ నోటీను నిమిత్తముతేది:04-12-2025న వాయిదా వేశినారు, తేది 04-12-2025న ఉదయం10.30.ని.లకు పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగాగానీ లేక లాయరు గారి ద్వారా గానీ హాజరు పడి, మీ ఆక్షేపణలు తెలియచేయగలరు. లేని యడల మీ పరోక్షమున కేసు తీర్మానం చేయబడునని తెలియ జేయడమైనది

// కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //

వాయిదా తేది : 04-12-2025

ఇట్లు
M.గంగాధర్‌రావు,B.A, BL.,
K.శివ ప్రసాదరావు,B.Sc, B.L.,
DHR తరపున న్యాయవాదులు
ఒంగోలు

కరువు సీమకు.. నేడు చంద్రబాబు రాక

(మొదటిపేజీ తరువాయి)

పర్యటన ఖరారైంది. కనిగిరి నియోజకవర్గానికి కలిసొచ్చిన అవకాశంగా భావిస్తున్నారు. త్వరలో కొత్తగా జిల్లాగా అవతరించనున్న మార్కాపురం జిల్లా పరిధిలో కనిగిరి నియోజకవర్గం ఉంది. ఈ నేపథ్యంలో సిఎం చంద్రబాబు పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. అభివృద్ధిపై ఈ ప్రాంత ప్రజల్లో అనేక ఆకాంక్షలున్నాయి. కనిగిరి ప్రాంతాన్ని పరిశ్రమలకు కేంద్రంగా మార్చే క్రమం మొదలైంది. కనీస మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు మొదలు పెట్టారు. అయితే పరిశ్రమలు వచ్చేలా చూడాల్సిన అవసరం ఉంది. ఇటీవలే ఇదే మండలంలో రిలయన్స్ సంస్థ బయోఇంధన ప్లాంటు పెట్టేందుకు సన్నాహాలు చేపట్టింది. గతంలో దీనికి మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఇప్పుడు మళ్లీ పీసీపల్లి మండలం, లింగన్నపాలెం వద్ద ఎంఎస్ఎంఈ పార్కును అభివృద్ధి చేశారు. సుమారు 54 ఎకరాల్లో ఏపిఐఐసీ ఇక్కడ రోడ్లు, కాలువలు నిర్మించింది. పరిశ్రమలు పెట్టేవారికి ప్లాట్లు కేటాయించను న్నారు. దీనికి సమీపంలోనే మాలకొండ ఆనుకునే మరో పరిశ్రమల కేంద్రం ఉంది. ఇక్కడ నిమ్జ్ పరిధిలో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక్కడా రోడ్లు వేశారు. అయితే ఇక్కడ పరిశ్రమలు రాలేదు. కొన్ని సంస్థలను ప్రోత్సహించి ఇక్కడ పరిశ్రమలు పెట్టేలా చూడాల్సిన అవసరం ఉంది. నీళ్లు కీలక అవసరం. ఈ ప్రాంతంలో ప్రస్తుతం నీళ్ల సమస్య తీవ్రంగానే ఉంది. వెలిగొండ ప్రాజెక్టుతోనే ఈ ప్రాంతానికి కరువుతో పాటు నీటి కష్టాలు తీరనున్నాయి. సిఎం చంద్రబాబు జిల్లాకు వస్తున్నారంటే జిల్లాకు ఏం ప్రకటిస్తారోనన్న ఉత్కంఠ కూడా సహజంగానే ఉంటుంది. ఇటీవల మొంథా తుఫాను తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. కేంద్ర బృందం కూడా సోమవారంనాడు జిల్లాలో పర్యటించింది. నష్టాలు జరిగిన ప్రాంతాల్లో పర్యటన లేదు. వారి పరిశీలన ఎలా ఉన్నా పాలకులు నష్టాలపై స్పందించి నిధులు ఇవ్వాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలదే ఈ కర్తవ్యం. అధికారులు నివేదికలు ఎలా ఉన్నా నిధులు ఇవ్వాల్సింది ప్రభుత్వాలే.. ఇక పశ్చిమప్రాంతంలో చూస్తే ఇటీవలే సిఎం చంద్రబాబు దర్శి నియోజకవర్గానికి వచ్చారు. అక్కడే వెలిగొండపై కీలక ప్రకటన చేశారు. అయితే ఆ హామీ నెరవేర్చే దిశగా పనులు మాత్రం మొదలు కాలేదు. ఇప్పుడు తుఫాను వల్ల కురిసిన భారీ వర్షాలకు కాలువలు తెగిపోయాయి. సొరంగాల్లో సగందూరం వరకూ నీళ్లు చేరిపోయాయి. వాటిని ఇప్పుడు మోటార్లు పెట్టి బయటకు తోడుతున్నారు. లోపల లైనింగు పనులకు ఆటంకం ఏర్పడింది. ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాజెక్టును సందర్శించారు. మళ్లీ ఈ నెల 12, 13 తేదీల్లో వస్తానని అధికారులకు చెప్పి వెళ్లారు. ప్రస్తుతం నీళ్లు తోడే పనులు జోరుగా చేపట్టారు.దీనికి నిధులదే పెద్ద సమస్య. నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వలేదు. ఏడాదిన్నరగా ఎదురుచూస్తున్నారు. పునరావాస కాలనీల్లోనూ సౌకర్యాలు పూర్తికావాలి. అక్కడ ఇళ్లు కట్టుకుంటే తప్ప తరలివెళ్లడం సాధ్యం కాదు. వెలిగొండకు మరో రూ.నాలుగు వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.వంద లేదా రూ.రెండొందల కోట్లు కేటాయిస్తోంది. అరకొర చర్యలతో వెలుగొండ నీళ్లు వచ్చే సీజన్‌కు కాదు కదా? మరో నాలుగేళ్లు పట్టినా ఆశ్చర్యం లేదు. వెలిగొండపైనే అందరి ఆశలున్నందున దీనిపై సిఎం చంద్రబాబు దృష్టి సారిస్తారని భావిద్దాం. జిల్లాకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపైనా ఆశలు పెట్టుకున్నారు. జిల్లా డెయిరీ పునరుద్దరణకు చర్యలు కనిపించడం లేదు. తాగునీటి పథకాలు, పట్టణాల్లో అండర్‌గ్రౌండు డ్రైనేజీ వ్యవస్థలు, రోడ్లు వంటి వాటిపై హామీలున్నాయి. అభివృద్ధి పనులకు నిధుల్లేకపోవడం వంటివి ఇప్పుడు సంక్లిష్టంగా మారాయి. ఏ పనులు చేపట్టాలన్నా నిధుల్లేవనే చర్చ ముందుకు వస్తోంది. పట్టణాల్లో విస్తరణ పనులకూ ఇదే సమస్యగా మారింది. ఇంకా ఇళ్ల స్థలాలపై పదేపదే చర్చ సాగుతున్నా కార్యరూపం దాల్చలేదు. టిడ్కో ఇళ్లు అలాగే పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఇళ్లు కూడా సగానికిపైగా పూర్తి కాలేదు. ఇక భారీ వర్షాలకు ముంపు సమస్యతో రోడ్లు దెబ్బతిన్నాయి. పంటలకు నష్టం జరిగింది. మున్సిపాల్టీలు, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలకు నష్టం వాటిల్లింది. డిఆర్‌సీలో చర్చ సాగింది.

సిఎం పర్యటన సాగేదిలా...

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిసిపల్లి మండలం లింగన్నపాలెం రానున్నారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు ఉండవల్లిలోని సిఎం నివాసం నుంచి బయలుదేరి ఉదయం 10.15 గంటకు పిసిపల్లి మండలం పెద్ద ఈర్లపాడు హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 10.15 నుంచి 10.25 గంటల వరకు ప్రజాప్రతినిధులు, అధికారులను కలుసుకుంటారు. 10.25 గంటలకు రోడ్డు మార్గంలో పెద్ద ఈర్లపాడు బయలుదేరతారు. 10.30 లింగన్నపాలెంలోని సభా వేదికకు చేరుకుంటారు. 10.35 నుంచి 12.15 గంటల వరకు ఎంఎస్ఎస్ఈ పార్కును సిఎం చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారు. వివిధ పెట్టుబడుల ప్రాజెక్ట్‌లు, రాష్ట్రంలోని ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేస్తారు. సిఎం చంద్రబాబు నాయుడు ఎంఎస్ఎంఈ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, పరిశ్రమల ప్రతినిధులను కలుసుకుంటారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 12.15 గంటలకు సిఎం రోడ్డు మార్గంలో పెద్ద ఈర్లపాడు హెలీప్యాడ్‌కు బయలుదేరతారు. మధ్యాహ్నం 12.25 గంటలకు సిఎం హెలీకాప్టర్‌లో ఉండవల్లికి బయలుదేరతారు.

Dr. Samuel George Institute of Engineering & Technology
(An Autonomous Institute with NAAC 'A' Grade)
(Approved by AICTE, New Delhi Permanently Affiliated to JNTUK, Kakinada)
(Recongised under Section 2(f) & 12(B) of UGC, An ISO 9001 : 2015 Certified Institution)
SGIT B.O. - 523 320, George Town, Darimadugu (V), MARKAPUR (M), Prakasam (Dist), A.P. India.
e-mail : sgit.principal@gmail.com : Website : www.drsgiet.ac.in : University College Code : 35
Mobile : 9618257287, 9849332122
SGIET MARKAPUR Since...1997
A NAAC CGPA 3.12 NAAC

WANTED FACULTY

Applications are invited from well-qualified and committed professionals for the following positions

TEACHING POSITIONS

Principal /Professor/Associate Professor/Assistant Professor

In following Departments CSE, AIML, CSE-AI, CSE-DS, ECE, Mathematics, Physics, Chemistry and English.

Non-Teaching Positions

Network / System Administrators, Hardware Technicians, Lab Technicians and Office Staff

Qualifications, Experience & Salary: As per AICTE norms.

Eligible candidates may send their detailed résumé to sgit.principal@gmail.com Mention your Branch, Highest Qualification, and Position Applied For in the email subject line.

Sd/-
Secretary

ప్రజాశక్తి
మంగళవారం 11 నవంబర్ 2025

కర్రపుల్లలే ప్రమాద హెచ్చరికలు

ప్రమాదకరంగా పెద్దకొత్తపల్లి నేలచప్టా

రాకపోకలకు గ్రామస్తుల ఇబ్బందులు

బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.62 కోట్లతో ప్రతిపాదనలు

నేటికీ ముందుకు కదలని వైనం

ప్రజాశక్తి-మద్దిపాడు

సాధారణంగా మనం అనేక చోట్ల ఇక్కడ ప్రమాదం పొంచి ఉంది.. జాగ్రత్తగా వెళ్ళండి.. అని ప్రమాద సూచికలు తెలిపే బోర్డులను తరచూ చూస్తూ ఉంటాం. కానీ ఇక్కడ మాత్రం కర్రపుల్లలే ప్రమాద సూచికలుగా దర్శనమిస్తున్నాయి. పెద్దకొత్తపల్లి నేలచప్టా ఎంత ప్రమాదకరంగా ఉందో కళ్ళకు కనపడుతుంది. మండల పరిధిలోని పెద్దకొత్తపల్లి ముఖద్వారాన ముదిగొండ వాగుపై ఉన్న నేలచప్టా ప్రమాదకరంగా ఉంది. రాకపోకలు సాగించాలంటే గ్రామస్తులు భయపడుతున్నారు. కారణం నేలచప్టా ఒకవైపున పూర్తిగా కృంగిపోయింది. దీంతో రాకపోకులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నేలచప్టా కృంగిపోయిన

ప్రమాదకరంగా ఉన్న నేలచప్టాపై ఏర్పాటు చేసిన కర్ర పుల్లలు

ప్రదేశంలో కర్ర పుల్లలను గుచ్చి వాటికి రిబ్బన్లు కట్టి బ్రిక్స్ రాళ్లను అక్కడక్కడ పెట్టారు. వాహనదారులు కూడా భయం భయంగానే రోడ్డు దాటాల్సి వస్తుంది. వర్షాలు పడిన ప్రతిసారి నేలచప్టాపై నీళ్ల ప్రవహించే రాకపోకలకు ఇబ్బందులు కలుగుతుందని వెంటనే నూతన బ్రిడ్జి నిర్మాంచాలని ఆ గ్రామానికి చెందిన పలువురు అనేకసార్లు ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ రాజా బాబుకు సైతం ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బ్రిడ్జి నిర్మాణం కోసం కోటి 62 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆర్అండ్‌బి అధికారులు చెబుతున్నారు. మొన్న కురిసిన వర్షాలకు నేలచప్టా సగం వరకు కుంగిపోగా కనీసం దానిపై చిన్నపాటి మరమ్మతులు కూడా చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం గ్రామంలోకి ద్విచక్ర వాహనాలు మాత్రమే చప్టాపై నుండి వెళ్తున్నాయి. ఫోర్ వీలర్ వాహనాలు మాత్రం వెళ్ళడానికి వీలు లేకుండా పోయింది. గ్రామం నుంచి మద్దిపాడు, ఒంగోలు వెళ్లాలంటే చుట్టుపక్కల ఉన్న గ్రామాలపై నుంచి వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నూతన బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు వెంటనే ఆమోదించి పనులు ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏఎన్ఎంల సమస్యల పరిష్కారానికి పోరాటం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సెకండ్ ఏఎన్ఎంల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటం చేపట్టవలసిన అవసరం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మెడికల్ అండ్ హెల్త్ విభాగానికి చెందిన సెకండ్ ఏఎన్ఎంల సమావేశం జరిగింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా అన్ని అర్హతలతో పరీక్షలు రాసి ఎంపికైన సెకండ్ ఏఎన్ఎంలను ఇప్పటివరకు రెగ్యులర్ చేయకపోవడం ప్రభుత్వ దుర్మార్గమైన వైఖరిని సూచిస్తోందని విమర్శించారు. కనీసం మినిమమ్ టైమ్ స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, వీరికి రిటైర్మెంట్

ఏఎన్ఎంల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రయోజనాలు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. వీరి కంటే వెనుక చేరినవారిని రెగ్యులర్ చేసి, వీరిని విస్మరించడం అన్యాయం అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయాల్లో ఖాళీలు భర్తీ చేసే సమయంలో సెకండ్ ఏఎన్ఎంలలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ సెకండ్ ఏఎన్ఎంల పోరాటానికి సీఐటీయూ అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర పిలుపు మేరకు ఈనెల 24న వైద్య శాఖ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం మెయిల్ ద్వారా పంపాలన్నారు. డిసెంబరులో విజయవాడలో జరిగే దీక్షలో అధిక సంఖ్యలో ఎఎన్ఎం లు పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం వినతిపత్రం ప్రతినిధులు డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ టి.వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈసమావేశంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన సెకండ్ ఎఎన్ఎంలు లీల, మరియమ్మ, మల్లేశ్వరి, రవికుమారి, యాస్మిన్, కోటమ్మ, నాగరత్నమ్మ, సుజాత, అపర్ణ,లక్ష్మీదేవి, విజయ్ కుమారి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లు.. మూన్నాళ్ల ముచ్చటే

కొండపి జండా చెట్టు సెంటర్‌లో ప్రజల ఇక్కట్లు

ప్రజాశక్తి-కొండపి

మూడు నెలల క్రితం కొండపిలో కామేపల్లి సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు నూతన వీధిలైట్లను ఎంతో ఖర్చు చేసి అమర్చారు. ఇప్పుడు ఆ వీధిలైట్లు వెలగక మున్నాళ్ళ ముచ్చటగానే మిగిలిపోయాయి. నాసిరకమైన వీధిలైట్లు బిగించడం వలన అవి కొన్ని రోజులకే పరిమితమయ్యాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళలో 9 గంటలు దాటితే దుకాణాలను మూసివేయడంతో గాంధీ బొమ్మ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్

చీకట్లో కాలనీ

వరకు చిమ్మ చీకటిగా ఉంటుందని ఆ చీకటిలో వీధి కుక్కలు వెంబడిస్తున్నాయని పలువురు వాపోతున్నారు. వీధి కుక్కలు వెంట పడడం వల్ల పలు ద్విచక్ర వాహనదారులు జారిపడి దెబ్బలు తగిలిన సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా వీధిలైట్లను వెలిగించి వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని కొండపి ప్రజలు కోరుకుంటున్నారు.

సఫాయి కర్మచారి యువతకు రుణాలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లాలోని సఫాయి కర్మచారి వృత్తికి చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె అర్జున్ నాయక్ సోమవారం నాడు మీడియాకు తెలిపారు. నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్ కెఎఫ్ డిసి) ఆధ్వర్యంలో సబ్సిడీతో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలు మంజూరు చేయడానికి ఎస్సి కార్పొరేషన్ శాఖ దరఖాస్తులు కోరుతున్నట్లు ఇడి పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న యువత 5 గురు సభ్యులతో కూడిన గ్రూపుగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి సభ్యుడు సఫాయి కర్మచారి సర్టిఫికేట్ కలిగి ఉండటం తప్పనిసరని పేర్కొన్నారు. గ్రూపులో కనీసం ఒకరు హెవీ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రధాన సభ్యుడు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల షురిటీ సమర్పించాలని వివరించారు. పూర్తి వివరాలకు 9963288656 నంబరులో సంప్రదించాలన్నారు.

రూ.4 కోట్లతో సంగమేశ్వరం అభివృద్ధి

మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య

ప్రజాశక్తి-శింగరాయకొండ

పొన్నలూరు మండలం చెన్నుపాడు గ్రామం వద్ద ఉన్న సంగమేశ్వరం దేవాలయాన్ని రూ.4 కోట్లతో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. సోమవారం కార్తీక మాసం కావడంతో అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి వనభోజనాల కార్యక్రమాన్ని దామచర్ల కుటుంబం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దామచర్ల సత్యకి ఆలయ కార్యనిర్వహణ అధికారి బైరాగి చౌదరి ఆధ్వర్యంలో అర్చకులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంలోనే దేవస్థానం అభివృద్ధికి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిశామన్నారు. రూ.4 కోట్ల నిధులు మంజూరు చేయమని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. వైసీపీ హయాంలో దేవస్థానం అభివృద్ధికి ఒక్క రాయి కూడా పెట్టలేదన్నారు. అదేవిధంగా సంగమేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంత ప్రజలకు సాగునీరు, తాగునీరు అందుతుందన్నారు. మంత్రులతో మాట్లాడి సంగమేశ్వరం ప్రాజెక్టు పనులు అతి త్వరలో మొదలయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు. పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతిన్నాయని, రూ.25 కోట్లతో పనులు త్వరలో మొదలుపెడతారని వివరించారు. అనంతరం కార్తీక సోమవారం కావడంతో మహిళలు దేవస్థానం వద్దకు పెద్ద ఎత్తున వచ్చారు. కార్తీక మాస వనభోజనాలను దామచర్ల సత్య ప్రారంభించారు.

మాట్లాడుతున్న దామచర్ల సత్య

అనంతరం నాయకులు సత్యాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనుమేలు సాంబయ్య, మించల బ్రహ్మయ్య, వసంతరావు, పోకూరి రవీంద్ర, గొర్రెపాటి రామయ్య చౌదరి, కొండ్రగుంట శ్రీనివాసరావు, బత్తుల నారాయణస్వామి, మక్కెన వెంకట్రావు, మాధవరావు, వేల్పుల సింగయ్య, గొల్లపూడి సత్యనారాయణ, సుదర్శి ప్రసాదరావు, మోటూపల్లి వెంకటేశ్వర్లు, నర్ర రాంబాబు, నక్క బ్రహ్మేశ్వరరావు, కర్ణ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు : మంత్రి

ప్రజాశక్తి-టంగుటూరు

కొండపి మండలం నెన్నూరుపాడులో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు శుభ పరిణామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ దేశ విదేశాలు తిరిగి పరిశ్రమలు పెట్టుబడులు తీసుకొస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేపు కనిగిరి పర్యటనలో రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల ఎం.ఎస్.ఎం.ఈ పార్కులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అందులో భాగంగా ప్రకాశం జిల్లా కొండపి మండలం నెన్నూరుపాడులో రూ.7 కోట్ల పెట్టుబడులతో ఎం.ఎస్.ఎం.ఈ పార్కుకి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ లక్ష్మీ ప్రసన్న

నెన్నూరుపాడులో ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలోని నెన్నూరుపాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంఎస్ఎంఈ ప్రాజెక్టుకు వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేస్తారని ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న తెలిపారు. సోమవారం ఏర్పాట్లను తహశీల్దార్ శీలం శ్రీనివాసరావు, ఎంపీడీవో రామాంజనేయులుతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ సంవత్సరం క్రితం ఆ స్థలాన్ని ఏపీఐఐసీకి కేటాయించామన్నారు. డిఈ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రాజెక్టు వ్యయం 7 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఖాళీ స్థలాన్ని పంచాయతీ సెక్రటరీ జెసిబి ద్వారా చదును చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో ఆర్.ఐ శ్రీనివాసరావు, సెక్రటరీ వెంకటేశ్వర్లు ఉన్నారు.

మొంథా తుపానుతో విద్యుత్ శాఖకు రూ.40 లక్షల నష్టం

ప్రజాశక్తి-దర్శి : మెంథా తుఫాను కారణంగా ఎనిమిది మండలాలలో రూ.40 లక్షల నష్టం వాటిల్లినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.శ్రీనివాసులు తెలిపారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలోని దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు, దొనకొండ పరిధిలో మొత్తం 84 స్తంభాలు, 17 ట్రాన్స్‌ఫారాలు దెబ్బతిన్నాయన్నారు. అదేవిధంగా తమ పరిధిలోని పొదిలి, కొనకలమిట్ల, మర్రిపూడిలో కూడా 28 విద్యుత్తు స్తంభాలు, 10 ట్రాన్స్‌ఫారాలు దెబ్బతినగా వాటిని కూడా మార్చినట్లు ఆయన తెలిపారు. మొత్తం మీద 112 స్తంభాలు 27 ట్రాన్స్‌ఫారాలు తుఫాను కారణంగా మార్చడంతో మొత్తం 40 లక్షల రూపాయలు నష్టం వాటిల్లగా వాటిని పునరుద్ధరణ చేసినట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవం

ప్రజాశక్తి-దర్శి

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కామర్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభుదాస్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అకౌంటెంట్లు మరియు ఆర్థిక నిపుణుల సేవలను గుర్తించి గౌరవిస్తారన్నారు. సమాజానికి వ్యాపారాలకు వారి అమూల్యమైన సహకారాన్ని సెలబ్రేషన్ చేసుకోవడం దీని ముఖ్యఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కామర్స్ డిపార్ట్మెంట్ అధ్యాపకులు బి.సౌరీలమ్మ, జి.రమేష్‌బాబు, యు.నాగేశ్వరరావు, ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ అధ్యాపకులు డాక్టర్ ఎ.నగేష్ పాల్గొన్నారు.

పొగాకు రైతుల ఖాతాల్లో డబ్బు వేయండి

ప్రజాశక్తి - బాపట్ల

రైతుల నుండి పొగాకు కొనుగోలు చేసి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో డబ్బు వేయకపోవడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. కలెక్టరేట్లో సోమవారం జరిగిన ప్రజా పరిష్కారం వేదికలో రైతులతో కలిసి కలెక్టరుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ జిల్లాలో పర్చూరు మండలం చెరుకూరులో 150 మంది రైతుల పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిందని తెలిపారు. వెంటనే రైతులు ఖాతాల్లో డబ్బు వేస్తామని చెప్పి ఇంతవరకు డబ్బులు వేయకపోవడంతో వ్యవసాయ సీజన్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వడ్డీలకు డబ్బులు అప్పులు ఇచ్చిన వాళ్ళు, కూలీలు డబ్బుల కోసం ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. మరోవైపు వ్యవసాయానికి పెట్టుబడి లేక అప్పు పుట్టక, కుటుంబాలు గడవని పరిస్థితిలో పొగాకు అమ్మిన రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే పొగాకు రైతుల ఖాతాల్లో డబ్బులు వేయాలని కోరుతూ కలెక్టర్‌కు ఇచ్చిన అర్జీలో పేర్కొన్నట్లు గంగయ్య తెలిపారు. తక్షణమే రైతులకు డబ్బు చెల్లించాలని రైతులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి కొండయ్య, చెరుకూరు రైతు శివయ్య, హలీం, రామిరెడ్డి, దాసరి కొండయ్య, కరిముల్లా, బాజీ, రెహమాన్, వెంకటేశ్వర్లు, లోకేష్, సింగయ్య పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న సిహెచ్ గంగయ్య

నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లించాలి

వినతి పత్రం ఇస్తున్న తంగిరాల వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - బల్లికురవ

మొంథా తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో ఏపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దారు నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ మధ్యకాలంలో వచ్చిన తుఫాను కారణంగా రైతులు సాగు చేసిన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు. మొక్కజొన్న, పత్తి, చెరకు పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. వ్యవసాయ రంగంలో కౌలు రైతుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, నష్ట పోవడంలోను కౌలు రైతులు ఎక్కుమంది ఉన్నారని అన్నారు. నష్ట పరిహారం చెల్లించి కౌలు రైతులను కూడా ఆదుకోవాలని కోరారు. కౌలు రైతు గుర్తింపు కార్డుతో సంబంధం లేకుండా పంట సాగు ఆధారంగా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటల నష్టం 33శాతంతో సంబంధం లేకుండా ఎంత నష్టం జరిగితే అంత నష్టం లెక్కగట్టి చెల్లించాలని కోరారు. రైతు సేవా కేంద్రాల్లో ఈకెవైసీతో సంబంధం లేకుండా పంటలు వేసిన ప్రతి రైతుకు పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. తహశీల్దారు స్పందిస్తూ నష్ట పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పూరిల్లు పడిపోయిన వారికి కూడా నష్ట పరిహారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు జి అంజయ్య, బి వీరయ్య పాల్గొన్నారు.

వేమూరు : తుఫాన్ వల్ల దెబ్బతిన్న వరి పైరులో తాలు ఎక్కువగా ఉన్నట్లు చినపులివర్రు కౌలు రైతులు గుర్తించి కౌలు రైతు సంఘం దృష్టికి తీసుకువచ్చారు. కౌలు రైతు సంఘం నాయకులు టి సురేష్ మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించి నష్టపరిహారం అంచనాలు నమోదు చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో కొనసాగుతున్న కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు ఏర్పాటు చేసుకున్న రైతు మిత్ర, జాయింట్ లైబిలిటీ గ్రూపులోని సభ్యులు అధిక వడ్డీలకు ప్రైవేట్ అప్పులు చేసి నష్టపోతున్నారని అన్నారు. వారికి ప్రభుత్వ బ్యాంకుల్లో అవసరలకు తగ్గట్టు పొదుపుతో సంబంధం లేకుండా ఒక్కొక్క సభ్యునికి రూ.2లక్షల వరకు రుణాలు ఇవ్వాలని అన్నారు. రైతు మిత్ర జాయింట్ లైబిలిటీ గ్రూపుల రుణ పరిమితి పెంచాలని కోరుతూ ఈనెల 12న విజయవాడ నాబార్డ్ అధికారులతో రాయబారం చేయనున్నట్లు తెలిపారు. కావున జిల్లాలోని రైతు మిత్ర జాయింట్ లైబిలిటీ గ్రూప్ సభ్యులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కొండమూది పొట్టియ్య, దుండి బ్రహ్మారెడ్డి, చాట్రాగడ్డ శివరామకృష్ణ, వీర రాఘవులు, బొల్లా శివనాగేశ్వరావు పాల్గొన్నారు.

కౌలు రైతులతో మాట్లాడుతున్న నాయకులు సురేష్

మురుగు సమస్య పరిష్కరించాలి

మున్సిపల్ కమిషనర్‌కు సిపిఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ వినతి

ప్రజాశక్తి - రేపల్లె

మొంతా తుఫాన్ వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకొని మురికి నీటి సమస్య పరిష్కరించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ కోరారు. గ్రీవెన్స్ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె సాంబశివరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో శానిటేషన్ చేయించాలని కోరారు. పునరావాస కేంద్రాల్లో పేర్లు నమోదైన అందరికీ నష్టపరిహారం అందించాలని అన్నారు. తుఫాన్ వల్ల పట్టణంలో పిఎంఎవై ఎన్టీఆర్ నగర్ (పాత జగన్ కాలనీ), 20వ వార్డు ఐబీపీ పెట్రోల్ బంక్ వెనక కాలని, పట్టణంలో ఇతర ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని అన్నారు. డ్రైనేజీలు, రోడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇంటిలో నుంచి బయటికి రావాలంటే నీళ్లలో నడవాల్సి వస్తుందని అన్నారు. మురుగు నీళ్ళు కావడంతో పాములు వల్ల భయపడుతున్నారని అన్నారు. వీధిలైట్లు పాడైపోయినప్పటికీ కన్నెత్తి చూడటం లేదని విమర్శించారు. దీంతో దోమలకు ఆవాస కేంద్రాలుగా మారి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. 20వ వార్డు పరిధిలో ట్రైబల్ ఎస్ స్కూల్ పునరావాస కేంద్రంలో పేర్లు నమోదైనప్పటికీ అక్కడ స్థానికంగా ఉన్న నాయకుల ఒత్తిడితో రాజకీయ కారణాలతో నష్టపరిహారం ఇవ్వకుండా పేదల పేర్లు తొలగించారని అన్నారు వారిలో వితంతువులు, వికలాంగులు, ఏ ఆధారం లేని కుటుంబాల వాళ్ళు ఉన్నారని అన్నారు. అధికారులు నమోదు చేయాల్సిన పేర్లకు సంబంధిత డాక్యుమెంట్లను 20వార్డు నాయకులని చెప్పుకొని తమ ఇళ్లవద్దకే తెచ్చి ఇవ్వాలని, డాక్యుమెంట్స్ తీసుకొని నష్టపరిహారం ఇవ్వకపోవడం అంటే దుర్వినియోగం అయినట్లేనని అనినారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తుఫాన్ పోయిన పేదల నివాసాల్లో అనుకూల సదుపాయాలు కల్పించక పోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ, సిపిఎం నేతలు వి ధనమ్మ, కె నాంచారమ్మ, ఎండి ఫర్హానా, కె సింధుదేవి, డి ఆగస్టీన్, కె ఆశీర్వాదం, బి రాము పాల్గొన్నారు.

వినతి పత్రం అందిస్తున్న సిపిఎం కార్యదర్శి మణిలాల్

వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ట్రాక్టర్లను అనుమతించాలి

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని ఆవులవారిపాలెం పంచాయతీ పరిధిలోని క్రీస్తులంక దళిత వాడలోని ట్రాక్టర్లున్న కార్మికులను, చుట్టుప్రక్కల ట్రాక్టర్లున్న కార్మికులను గాజులంక ఇసుక క్వారీలోకి అనుమతించాలని సిపిఎం ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి తహశీల్దారు బి వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి కృష్ణమోహన్, బి సుబ్బారావు మాట్లాడుతూ మండలంలో అనేక మంది పేదలు ఫైనాన్స్‌పై ట్రాక్టర్లు తీసుకొని జీవనం సాగిస్తున్నారని అన్నారు. ఇటీవల వరదలు, తుఫాను కారణంగా పనులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో గాజులంక గ్రామస్తులు మాత్రమే ఇసుక తరలించడం, మిగతా ప్రాంతాల వారిని రానివ్వకపోవడం దారుణమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ఇసుకని ప్రభుత్వం ప్రకటించిన తరువాత కూడా అందరినీ అనుమతించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు జోక్యం చేసుకుని అందరినీ ఇసుక తోలుకునే విధంగా అనుమతించాలని కోరారు. లేని పక్షంలో కార్మికులను కలుపుకుని ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాక్టర్ల కార్మికులు మేడుకొండ బాలకృష్ణ, నలిగిల సీతారామయ్య, జి ప్రసన్న బాబు, బెజ్జం నాగరాజు, కె రవీంద్రబాబు, రవి పాల్గొన్నారు.

ఎబిపాలెంలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

విద్యార్థులకు ఎమ్మెల్యే ఏలూరి ప్రశంస

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని అన్నంబొట్లవారిపాలెంలో జరిగిన వివాహ వేడుకకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏదుబాడు నుండి అన్నంబొట్లవారి పాలెంలోని జడ్పీ ప్రభుత్వ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు ఎమ్మెల్యే ఏలూరిని చూసి పరుగులు తీస్తూ అక్కడికి చేరుకున్నారు. గుడ్ మార్నింగ్ సార్ అంటూ పిల్లలు సెల్యూట్ చేశారు. దీంతో ఎమ్మెల్యే ఏలూరి వెరీ గుడ్ మార్నింగ్ అంటూ విద్యార్థులను పలకరించారు. ఒక్కొక్కరిని స్కూల్, ఊరు, తరగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడారు. ఒక్కొక్కరితో ఏ సబ్జెక్ట్ అంటే ఇష్టం ఏం గేమ్స్ ఆడుతారని తెలుసుకున్నారు. విద్యా శాఖ మంత్రి లోకేష్ సారధ్యంలో విద్యలో పెను మార్పులు చేశారని, నూతనంగా రంగుల యూనిఫాం తీసుకొచ్చారని, ఎలా ఉందని విద్యార్థులను అడిగారు. చాలా బాగుందని సమాధానం ఇచ్చారు. భవిష్యత్తులో ఏం కావాలని అకుంటున్నారనే విషయాలు తెలుసుకున్నారు. పిల్లలు చెప్పిన సమాధానాలపై ఎమ్మెల్యే ప్రశంసల జల్లులు కురిపించారు. చిన్నారుల ధైర్యం, మాట్లాడే తీరు, నాయకుడి ఎదుట తమ అభిప్రాయాలు ధైర్యంగా చెప్పడం అక్కడి పెద్దలను ఆశ్చర్యపర్చింది. ఈ అనుహ్యమైన చర్చ కొన్ని నిమిషాలపాటు సాగింది. అక్కడి వాతావరణం చిరునవ్వులు చిందించింది. తరం మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధం ఎలా ఉండాలో ఈ సమావేశం చక్కగా చూపించింది. విద్యార్థులు బాగా చదువుకొని మంచి ఉన్నత స్థాయి పొందాలని ఆకాంక్షించారు.

టాయ్ మాల్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

టాయ్ మాల్ ప్రారంభం

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని దర్బారు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన టాయ్ మాల్ షోరూంను శాసన సభ్యులు ఎంఎం కొండయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీరాలలో ఒక అద్భుతమైన బొమ్మల దుకాణం ప్రారంభమవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. అన్ని వయస్సుల పిల్లలకు వినోద భరితమైన, సురక్షితమైన బొమ్మలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధన్, నాయకులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దారు సలీమ

వినతుల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - బాపట్ల

స్థానిక తాహశీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి ఆరు వినతులు అందాయని తహశీల్దారు షేక్ సలీమా తెలిపారు. రేషన్ కార్డులకు సంబంధించిన రెండు, భూమి సమస్యలపై నాలుగు అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో విద్యుత్, విద్య, గృహ నిర్మాణం, పంచాయతీ రాజ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి-పిసి పల్లి

మండలంలోని గుంటూరు లింగన్న పాలెంలో ఎస్‌ఎంఎస్‌ఈ ప్రారంభోత్సవానికి వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని ప్రకాశం ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తెలిపారు. బందోబస్తు విధులలో పాల్గొనే పోలీసు అధికారులతో సోమవారం ఎస్పీ బ్రీఫింగ్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభం నుండి ముగిసే వరకు ప్రతి అధికారి, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి.. తమ విధులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలంటూ సూచించారు. హెలిప్యాడ్, ముఖ్యమంత్రి గారి కాన్వాయ్ మార్గం, పైలాన్, సభా ప్రాంగణం ప్రాంతాల పరిసరాల్లో విధులు నిర్వహించే సిబ్బంది కాన్వాయ్ వచ్చే సమయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వివిఐపి, వివిఐపి వాహనాలను కేటాయించిన స్థలాల్లోనే పార్కింగ్ చేయించేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇద్దరు ఏఎస్పీలు, ఎనిమిది డీఎస్పీలు, 20 సిఐలు, 49 ఎస్‌ఐలతో పాటు మొత్తం 800 మంది పోలీసులు, హోం గార్డులు మరియు ఇతర భద్రతా సిబ్బందిని బందోబస్తు విధుల్లో నియమించినట్లు తెలిపారు. ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా ఆరు ప్రత్యేక మొబైల్ బైక్ పెట్రోలింగ్ టీమ్‌లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం హెలీప్యాడ్ నుండి సభా స్థలి వరకు ముఖ్యమంత్రి గారి కాన్వాయ్ ట్రయిల్ రన్‌ను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఎస్పీ వెంట కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఒంగోలు డిఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, మార్కాపురం డీఎస్పీ యు నాగరాజు, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, కనిగిరి సిఐ షేక్ ఖాజావలి, స్థానిక ఎస్సై జి కోటయ్య ఉన్నారు.

ఏర్పాట్లపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో చర్చిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే ఉగ్ర

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

మండలంలోని గుంటూరు లింగన్నపాలెం ప్రాంతంలో ఎంఎస్ఎంఈ పార్క్ ప్రారంభోత్సవానికి వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ప్రాంతాన్ని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సోమవారం పరిశీలించారు. మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, డిసిఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డితో కలిసి ఉగ్ర పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి వచ్చే హెలిప్యాడ్ ప్రాంతాన్ని, సభా ప్రాంగణాన్ని, పైలాన్‌ను ప్రాంతాన్ని దగ్గరుండి పరిశీలించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజును అడిగి బందోబస్తు వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం బాలసుబ్బయ్య, మురుగుమ్మి ఎంపీటీసీ చెరుకూరి సతీష్‌బాబు, పువ్వాడ నాగరాజు, జనసేన నాయకులు మాదాసు రమేష్, కరణం తిరుపతిరావు, వడ్డెంపూడి వెంకటరావు, వేమూరి రామయ్య, కసిరెడ్డి హనుమారెడ్డి పాల్గొన్నారు.

అమెరికా ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయాలి

మాజీ ఎమ్మెల్సీ కె.యస్.లక్ష్మణరావు పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తన ఆధీనంలో ఉంచుకునేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తూ.. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడే దిశగా కేంద్ర ప్రభుత్వం ధైర్యంగా అడుగులు వేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, శాసనమండలి మాజీ సభ్యులు కెయస్.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం ప్రోగ్రెసివ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన 'ట్రంప్ టారిఫ్ విధానాలు.. భారతదేశంపై ప్రభావం' అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన ముఖ్యోపన్యాసం చేశారు. ట్రంప్ ప్రభుత్వ సుంకాల విధానం వాణిజ్య యుద్ధాలకు దారితీస్తోందని, అమెరికా విధానాల ప్రభావం భారతదేశంలోని వ్యవసాయ, పరిశ్రమ రంగాలపై తీవ్రమైన సంక్షోభాన్ని నింపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా ఆర్థిక దోపిడీ, సామ్రాజ్యవాద ఒత్తిళ్ళ మళ్లీ ప్రపంచ వాణిజ్య వ్యవస్థను ప్రభావితం చేస్తున్న ఈ సమయంలో, స్వతంత్ర ఆర్థిక విధానాల దిశగా ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కేవలం రాజకీయ పరిమితి కాకుండా ఆర్థిక స్వావలంబనతో కూడి నడిగా ఉండాలని హితవు పలికారు. సెమినార్‌కు అధ్యక్షత వహించిన జెవివి సీనియర్ నాయకులు ఎవి.పుల్లారావు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా గతంలో భారతదేశం అనుసరించిన అలీన విధానమే దేశ రక్షణకు బలమైన మార్గమని అన్నారు. ప్రపంచ దేశాలు అమెరికా ఒత్తిడికి లోనుకాకుండా తమ ఆర్థిక, రాజకీయ స్వతంత్రతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు మాట్లాడుతూ, అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచవ్యాప్తంగా దేశాలపై ఆర్థిక ఆంక్షలు విధిస్తూ, యుద్ధాలను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. ఉపాధ్యాయులు, విద్యావంతులు ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ, ట్రంప్ సుంకాల అమలు విధానాలు పరిశ్రమలను కుదేలు చేస్తున్నాయని, ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి నెలకొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అమెరికా ఆధిపత్య విధానాలను వ్యతిరేకించి దేశీయ పరిశ్రమలను రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి.శేషయ్య, జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.జయప్రకాష్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్ కె అబ్దుల్ హై, నాయకులు ఎస్ రవి, జి.ఉమామహేశ్వరి, ఎం.సంధ్యారాణి, ఎం.చిన్నస్వామి, సిహెచ్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లాలో నేడు కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మొంథా తుపాను వల్ల బాపట్ల జిల్లాలో జరిగిన నష్టాన్ని పరిశీలించటానికి పౌసుమి బసు నేతృత్వంలోని కేంద్ర బందం మంగళవారం జిల్లాలో పర్యటించనుంది. సోమవారం ప్రకాశం జిల్లాలో పర్యటించిన బృందం మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి వేటపాలెం మండలం రామాపురం, చీరాల మండలం వాడరేవులో పర్యటిస్తారు. ఈ రెండు మండలాల్లో తుపాను వల్ల నీటమునిగిన పంట పొలాలు, దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులు, వంతెనలను పరిశీలిస్తారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌కి చేరుకొని తుపాను వల్ల జిల్లాలో జరిగిన నష్టంపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారు. జిల్లా కలెక్టర్, జేసీ, జిల్లా అధికారులతో సమావేశమై తుపాను వల్ల జరిగిన నష్టం వివరాలు తెలుసుకుంటారు. ఇక్కడి నుంచి అమరావతి సచివాలయానికి వెళ్తారు.

39 వేల ఎకరాల్లో పంట నష్టం

తుపాను ప్రభావం తో కురిసిన భారీవర్షాలకు జిల్లాలో సుమారు 39 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు లెక్కలు తేల్చారు. 33,717 ఎకరాల్లో వ్యవసాయ పంటలు, 5,168 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు తుది అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. అయితే ముందుగా రూపొందించిన ప్రాథమిక అంచనాల్లో జిల్లాలో ముందుగా 85 వేల ఎకరాల్లో, ఆ తరువాత 68 వేల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు చూపించారు. కానీ తుది అంచనాకు వచ్చేసరికి 39 వేల ఎకరాలకు నష్టం అంచనాలు తగ్గిపోయాయి. పంటనష్టాన్ని మాన్యువల్‌గా నమోదు చేయడానికి వీలుపడలేదు. ఏపీ ఏఐ ఎంఎస్‌యాప్ ద్వారా పంట నష్టం వివరాలు సేకరించారు. యాప్‌లో ఈ-క్రాప్ నమోదు కాని పంటలు దెబ్బతిన్నా నష్టం చూపించే అవకాశం లేకపోయింది. దీంతో పంట నష్టం విస్తీర్ణం చాలా తగ్గిపోయింది. వర్షాలకు పంటలు దెబ్బతిని కళ్లెదుట కనిపిస్తున్నా వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది నమోదు చేసే వీలు లేకపోయింది. ఈ భారీ వర్షాల కారణంగా పంటలతో పాటు నల్లమడ, పర్చూరు, ఓగేరు,ఆలేరు, సాకి, తదితర వాగులు, కొమ్మమూరు కాలువకు పలు చోట్ల గండ్లు పడ్డాయి. చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో రోడ్లు, వంతెనలు, చప్టాలు దెబ్బతిన్నాయి.

నల్లమడ వాగు వరదలకు

శాశ్వత పరిష్కారం చూపాలని వినతి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలలో ప్రవహించే నల్లమడ వాగు వరదల వల్ల లక్షలాది ఎకరాలలోని పంటలు నీళ్ళ పాలై రైతులకు అపారమైన నష్టం జరుగుతున్న నేపథ్యంలో శాశ్వత వరద నివారణ కోసం ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం నాడు కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం నేతలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న నల్లమడ రైతుసంఘం నేతలు

అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉండాలి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వస్తున్న అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం స్థానిక కలెక్టరేట్ లో సోమవారం జరిగింది. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవించారు. తన పరిధిలోని వాటికి ఆయన అప్పటికప్పుడే పరిష్కార మార్గం చూపారు. కొన్నింటిని పరిశీలన, మరికొన్నింటిని విచారించాలని సంబంధిత అధికారులకు ఆయన పురమాయించారు. పీజీ ఆర్ ఎస్ లో 218 అర్జీలు నమోదయ్యాయి.కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డిఓ గ్లోరియా, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రూ.7 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్క్

ప్రజాశక్తి-పిసి పల్లి

మండలంలోని గుంటూరు లింగన్నపాలెం పరిసర ప్రాంతంలో నిఫ్ట్ ప్రాంతంలో సర్వే నెంబర్ 1459లో, ఏడు కోట్ల రూపాయల నిధులతో 22 ఎకరాలలో ఎంఎస్ఎంఈ పార్క్ ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నట్లు ఏపీఐఐసి డిప్యూటీ జోనల్ మేనేజర్ డి.స్వర్ణలత సోమవారం తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ పార్క్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ ప్రాంతంలో 56.53 ఎకరాలలో ప్రస్తుతం పార్క్ కోసం 22 ఎకరాల్లో పనులు చేపట్టారు. ఇందులో ప్రస్తుతం 22 ఎకరాల్లో 1.4 కిలోమీటర్ల రోడ్ల కోసం రూ.2.30 కోట్ల నిధులు ఖర్చు చేశారన్నారు. రూ.95 లక్షలతో 2.7 కిలోమీటర్ల కాలువలు ఏర్పాటు చేశామన్నారు. కల్వర్టుల కోసం మరో రూ.30 లక్షల ఖర్చు చేసినట్లు తెలిపారు.

తీవ్రంగా నష్టపోయాం..ఆదుకోండి..

కేంద్ర బృందం ఎదుట రైతుల ఆవేదన

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

తుపాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయామని, అప్పులు తీరే మార్గం కూడా కనిపించడం లేదని, తమను ఆదుకోవాలని రైతులు కేంద్ర బృందం ఎదుట తన ఆవేదన వెలిబుచ్చారు. మొంథా తుపాన్ ప్రభావంతో మండలంలో దెబ్బతిన్న పంటలను అంచనా వేసేందుకు కేంద్రబందం సభ్యులైన కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సంయుక్తకార్యదర్శి పౌసమిబసు, కేంద్ర ఆర్థిక శాఖ వ్యయ విభాగపు ఉపసంచాలకులు మహేష్‌కుమార్, విజయవాడ రోడ్లు, రవాణా, జాతీయ రహదారుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శశాంకశేఖర్ రాయ్, ఇస్రో నేషనల్ రిమోట్ సెన్సింగ్ శాస్త్రవేత్త సాయిభగీరథతో పాటు రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ ఎండి ప్రఖర్‌జైన్ నాగులుప్పలపాడులో దెబ్బతిన్న పంటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాగులుప్పలపాడు గ్రామానికి చెందిన కట్టా చిరంజీవికి చెందిన దెబ్బతిన్న పంటను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ వరి, పత్తి, మినుము, మొక్కజొన్న, మిర్చి తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఆ పంటలు దేనికీ పనికిరావని కేంద్రబందానికి వివరించారు.

కేంద్ర బృందానికి నష్టం వివరాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే జనార్ధన్

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: బీఎన్

సంతనూతలపాడు నియోజకవర్గంలో తుపాన్ వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని శాసనసభ్యులు బిఎన్.విజయ్ కుమార్ కేంద్రబృందానికి వినతిపత్రం అందజేశారు.

కేంద్ర బృందానికి నష్టాల గురించి వివరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

రైతుసంఘం వినతి

తుపాన్‌కు రైతాంగం తీవ్రంగా నష్టపోయారని, ఎకరానికి 25 వేల రూపాయలు నష్టపరిహారం అందించాలని, అదేవిధంగా దెబ్బతిన్న అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేయించాలని రైతు సంఘం మండల అధ్యక్షులు టి.శ్రీకాంత్ కేంద్రబృందానికి వినతిపత్రం అందజేశారు.

అల్లూరులో..

కొత్తపట్నం: మండలంలోని అల్లూరు గ్రామంలో తుపాన్‌కు దెబ్బతిన్న పంటలను, ఆక్వా రంగాన్ని కేంద్ర బృందం పరిశీలించింది. నష్టం వివరాలను ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ కేంద్ర బృందానికి వివరించారు. అల్లూరు గ్రామంలో దెబ్బతిన్న వరి పంటను బృందం పరిశీలించింది. రైతులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎకరాకు సుమారుగా 40 బస్తాలు పండేవని, ఈ వర్షం కారణంగా 10 బస్తాలు కూడా పండవని బృందం దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో బృందంతో పాటు కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తుపాన్ సాయం పంపిణీలో అవకతవకలు

ప్రజాశక్తి - భట్టిపోలు

చేనేత కార్మికులకు ఇస్తున్న బియ్యం, నిత్యావసర సరుకుల సహాయం విషయంలో మండలంలో అధికార పార్టీ నాయకులు అవకతవకలకు పాల్పడు తున్నట్లు చేనేత కార్మిక నాయకులు ఆరోపించారు. మండలంలోని ఐలవరంలో చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న దీపాల సుగుణకు వచ్చిన 50 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులను ఇటీవల తీసుకున్నట్లు తెలిపారు. సంబంధిత డీలర్ ఆదివారం ఉదయం ఫోన్ చేసి మీ పేరు లేదని అధికార పార్టీ నాయకులు చెబుతున్నారని, కావున మీరు తీసుకున్న సరుకులు వెంటనే తిరిగి ఇవ్వాలని కోరగా ఆమె డీలర్‌కు తిరిగి ఇచ్చిన ఘటన వెలుగు చూసింది. ఈ విషయమై చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ లబ్ధిదారు భర్త ఆ సంఘ నాయకులైన

వినతిపత్రం అందజేస్తున్న చేనేత నాయకులు

దీపాల సత్యనారాయణ ఆదివారం రాత్రి సంబంధిత డీలరును కలిసి అడుగగా మీతో పాటు మరో 30మంది వద్ద తిరిగి తీసుకొని తామిచ్చిన పేర్లకు వాటిని ఇవ్వాల్సింది అధికార పార్టీ నాయకులు తమపై ఒత్తిడి తెస్తున్నారని, ఆ 30 మంది దగ్గర పామాయిల్, బియ్యం, సరుకులను తీసుకోకుండా వాటి ఖరీదును తాము భరిస్తూ అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికి ఇస్తున్నామని చెప్పారని తెలిపారు. చేనేత కార్మిక సంఘ నాయకులు, సిపిఎం నాయకులు తహీల్దారు ఎం శ్రీనివాసరావును కలిసి జరిగిన విషయాన్ని వివరించారు. నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. వెంటనే తహశీల్దారు శ్రీనివాసరావు సంబంధిత డీలర్‌కు ఫోన్ చేసి లబ్ధిదారు సుగుణకు బియ్యం, సరుకులను ఇచ్చివేయాలని, ఇలాంటివి జరగకుండా చూడాలని హెచ్చరించారు. చేనేత నాయకులు మురుగుడు సత్యనారాయణ, దీపాల సత్యనారాయణ, బట్టు నాగమల్లేశ్వరరావు, సిపిఎం నాయకులు టి కృష్ణమోహన్, పి మనోజ్ పాల్గొన్నారు.

ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్ర స్థాయి ఖోఖో జట్టుకు ఎంపిక

ప్రజాశక్తి - చెరుకుపల్లి

చెరుకుపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఖోఖోలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. నవంబర్ 8న వినుకొండ లయోలా హై స్కూలులో జరిగిన జిల్లా స్థాయి సెలక్షన్స్ లో అండర్ 14, 17 విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్ 14 బాలికలు విభాగంలో ఏమినేని దివ్యశ్రీ, అండర్ 17 బాలికల విభాగంలో తుమ్మ ఉమా హర్షిత, కాటూరి వాసంతి ఎంపికయ్యారు. బాలల విభాగంలో పంది లీల మోహన్ కృష్ణ ఎంపికైనట్లు హెచ్‌ఎం కాటూరి లక్ష్మీనారాయణ తెలిపారు. వీరు నవంబర్ 23న విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, పిడి శ్రీనివాసరావును అభినందించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పర్చూరు

మండల కేంద్రమైన పర్చూరు వైసిపి కార్యాలయంలో వైసిపి ప్రజా ఉద్యమ గోడ పత్రిక ఆదివారం ఆవిష్కరించారు. వైసిపి ఇన్‌ఛార్జి మధుసూదనరెడ్డి మాట్లాడుతూ ఈనెల 12న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తలపెట్టిన ప్రజా ఉద్యమ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన గోడ పత్రిక విడుదల చేస్తున్నట్లు చెప్పారు. నాగుల పాలెంలో కోటి సంతకాల సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి కన్వీనర్లు కఠారి అప్పారావు, వీరయ్య చౌదరి, చిన్ని పూర్ణరావు, జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకర్, మువ్వల రాంబాబు, కుమ్మరి చందు, కాటి లక్ష్మణ్, దాసరి వెంకట్రావు, కంచనపల్లె రమేష్, గుజ్జర్లపూడి చిన్న, మల్లా శ్రీనివాసరావు, యన్నం శ్రీను, అహ్మద్, చౌదరి, రావెళ్ళ అంజిబాబు, జంగా వంశీ, సయ్యద్ సుభాని, గాదె సురేష్, నలిగల ప్రకాష్, లంక శివ, సుబ్బారెడ్డి, ప్రత్తిపాటి రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బిల్డింగ్ నిర్మాణం అడ్డుకుంటున్న అధికారులు

అనుమతి లేకుండా నిర్మిస్తే చర్యలు

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలో నిర్మిస్తున్న భవన నిర్మాణాలకు తప్పనిసరిగా మున్సిపాలిటీ నుండి పొందాలని, నిబంధనలు పాటించని నిర్మాణదారులపై పరిచర్యలు తప్పవని టిపిఒ కె శ్రీనివాసులు హెచ్చరించారు. పట్టణంలోని భాష్యం స్కూలు వెనుక వైపు 19వ వార్డు గొల్లపాలెం ప్రాంతంలో అనుమతి పొందిన ప్లాన్‌కు విరుద్ధంగా మూడో అంతస్తు నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన ఇనుప బుట్టలను అధికారులు గుర్తించి ప్రారంభ దశలోనే తొలగించారు. బిపిఎస్‌కు సంబంధించి 1736/2019 పిఎల్‌జి డీటీసీపీ ప్రకారం, బీపీఎస్ దరఖాస్తుల గడువు 2025 ఆగస్టు 31గా నిర్ధారించిన్నట్లు తెలిపారు. గడువు తేది అనంతరం నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మించిన భవనాలను రెగ్యులరైజ్ చేయబోమని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా గాని, అనుమతులకు భిన్నంగా కానీ ఎలాంటి నిర్మాణాలు చేయడానికి వీలులేదని సూచించారు. పట్టణ ప్రణాళిక నిబంధనలకు లోబడే నిర్మాణాలు ఉండాలని చెప్పారు. కావున టౌన్ ప్లానింగ్ అధికారుల అనుమతులు పొందకుండా నిర్మాణాలు చేపట్టవద్దని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తప్పవని తెలిపారు.

స్కాన్ సెంటర్లు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - బాపట్ల

మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఓ విజయమ్మ

స్కాన్ సెంటర్ యాజమానులు పిసిపి ఎన్‌డిటి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ సూచించారు. తన కార్యాలయంలో పిసిపి, ఎన్‌డిటి జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ, తనిఖీలు చేయకుండానే ఆరోగ్య పరీక్షలకు విరుద్ధమైన చర్యలకు పాల్పడితే అలాంటి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుం టామని పేర్కొన్నారు. 19ఏళ్ల లోపు యువతులు గర్భ ధారణ అధికంగా ఉన్న ప్రాంతాల్లో చిన్న వయసులో వివాహం చేసుకోవడం వల్ల కలుగే అనర్థాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి ఆసుపత్రి, స్కాన్ సెంటర్, లేబరేటరీల్లో తప్పనిసరిగా ధరల పట్టిక ప్రదర్శించాలని అన్నారు. ప్రతిరోజు ఫాం ఎఫ్‌ను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని అన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు ప్రసూతి విభాగం వైద్యులు డాక్టర్ శాంతి వైష్ణవి, వైద్యాధికారులు సౌధన్య, సుష్మ, లలిత రాజేశ్వరి, మనోజ్, మౌనిక, సాదిక్, ఎన్జీఒలు పి ప్రసాదరావు, పి మహమ్మద్ ఖాన్, డిపిహెచ్‌ఎన్‌ఓ సుగుణమ్మ, డిప్యూటీ డెమో బి మరియమ్మ, డిప్యూటీ హెచ్‌ఈఓ పరమేశ్వరి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పర్చూరు

మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్

ఎక్సైజ్ శాఖలో పెండింగులో ఉన్న కేసులు త్వరగా పరిష్కరించాలని ఒంగోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ ఆదేశించారు. పర్చూరు స్టేషన్‌ను అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులు పరిశీలించారు. క్రైమ్ డేటా సమీక్షించారు. అనంతరం సమీక్షలో జిసిఆర్ కేసులు, పెండింగ్ ఇన్వెస్టిగేషన్ కేసులు, బైండోవర్ వివరాలు, లోకాదాలత్‌లో కంపౌండ్ అయిన కేసులు, పెండింగ్ ట్రయల్ కేసులు, అరెస్టు కావలసిన నిందితుల వివరాలు పరిశీలించారు. కేసులు పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. సమీక్షలో ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా మద్యం షాపుల నిర్వహణ, ప్రతిరోజు సిబ్బందికి కేటాయించిన మద్యం షాపులను ఉదయం 10 గంటల ముందు, రాత్రి 10 గంటలు దాటిన తర్వాత యాప్ నందు షాపు ఫోటోను అప్లోడ్ చేయాలని చెప్పారు. గ్రామాల్లో అనధికార మద్యం దుకాణాలు ఎక్కడైనా ఉంటే వాటిపై తక్షణమే దాడులు జరిపి బెల్ట్ షాపులను నిర్మూలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ భుజంగరావు పాల్గొన్నారు.

'వైసిపి' కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - పర్చూరు

సంతకాలు సేకరిస్తున్న వైసిపి ఇన్‌ఛార్జి మధుసూదనరెడ్డి

ప్రభుత్వ వైద్య కాలేజీల ప్రవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన 'కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం' మండలంలోని నాగులపాలెంలో సోమవారం చేపట్టారు. వైసిపి ఇన్‌ఛార్జి గాదె మధుసూదనరెడ్డి ప్రజలతో మాట్లాడారు. పేదల ఆరోగ్య సంరక్షణ, వైద్య విద్య కోసం వైఎస్ జగన్మోహనరెడ్డి రాష్ట్రంలో 17వైద్య కళాశాలలకు అనుమతులు తెచ్చి నిర్మాణం ప్రారంభించారని తెలిపారు. వేల కోట్లు ప్రవేటు కంపెనీలకు రాయితీలు ఇస్తున్న కూటమి ప్రభుత్వం పేదల వైద్యం కోసం రూ.5వేల కోట్లు ఖర్చు చేయలేమని పిపిపి పద్ధతిలో ప్రవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు సిద్ధమైందని ఆరోపించారు. ఈ విధానానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసేందుకు సంతకాల సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సరోజిని, వైసిపి కన్వీనర్ కఠారి అప్పారావు, వైసిపి పట్టణ అధ్యక్షులు జంగా వంశీ, కోటా శ్రీనివాసరావు, మల్లా శ్రీనివాసరావు, కుమ్మరి చందు, కొల్లా శేషగిరి, కంచనపల్లి రమేష్, లంకా శివ, గాదె సురేష్, హరిప్రసాద్, సుబ్బారాయుడు, కూరాకుల రాజేష్, దరియావలి, డేవిడ్ పాల్గొన్నారు.

కలుపుతో బీళ్లుగా మారిన భూమి

బీళ్లుగా మారిన భూములు

ప్రజాశక్తి - ఇంకొల్లు

తుఫాను కారణంగా కురిసిన అధిక వర్షాలకు ఖరీఫ్లో సాగుచేసిన కొద్దిపాటి పైరులతోపాటు దుక్కి భూములు కలుపుతో బీళ్లుగా మారాయి. వర్షాలతో వ్యవసాయం చేసే అవకాశం లేకుండా పోయింది. దీంతో పొలాలన్నీ కలుపుతో బీళ్ల అయ్యాయి. పల్లపు ప్రాంతాలతో పాటు కొన్ని భూములు ఇప్పుడు కూడా దున్నుకోవటానికి అణువుగా ఆరకపోవటంతో కలుపు మందులు పిచికారి చేశారు. ఇదిలా ఉంటే మేరక ప్రాంతంలో దున్ను కోవడానికి అణువుగా ఆరిన భూముల్లో ట్రాక్టర్లతో దున్నుకోవడం ప్రారంభించారు. రబీ పంట సాగు నవంబర్ 2వ వారం కూడా అయిపోయింది. దీంతో రైతులు శనగ పంటతోపాటు మొక్కజొన్న పంట సిద్ధం చేస్తున్నారు. కొంత మంది రైతులు వర్షానికి ముందే అక్టోబర్ నెలలో అక్కడక్కడ మిరప సాగు చేశారు. అందులో మిరప నాట్లు వేశారు. మరికొందరు మిరప నాట్లకు సిద్ధం చేస్తున్నారు.

గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందిస్తున్న రైతులు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చీరాల

తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటల రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని వైసిపి రైతు విభాగం అధ్యక్షులు కావూరు రమణారెడ్డి కలెక్టర్ వినోద్ కుమార్‌ను కోరారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం పంట నమోదు చేసిన భూములకు మాత్రమే పరిహారం ఇస్తామని చెప్పడం కరెక్టు కాదని అన్నారు. అసైన్డ్ భూములు, కొంత మంది పట్టా భూములు కూడా పంట నమోదు కాకపోవడంతో రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. బోయినవారిపాలెం నుంచి విజయనగర్ కాలనీ, పందిళ్లపల్లి వరకు విస్తరించిన ప్రాంతాల్లో వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. అసైన్డ్ భూములు ఎక్కువగా ఉన్న చిట్టివాద రైతులు పంట నమోదు చేయలేక పోయారని తెలిపారు. ఇకెవైసి, ఈ క్రాప్ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. ఎలాంటి షరతులు లేకుండా పంట సాగు ఆధారంగా నష్టపోయిన రైతులు అందరికీ పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో దేవ సహాయం, రైతులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌చంద్

తుపాను ప్రభావిత ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ అధికారులతో కలిసి సోమవారం పర్యటించారు. తుఫాను వలన దెబ్బతిన్న పంట పొలాలు, కాలువలను పరిశీలించారు. నష్టం అంచనా తెలుసుకున్నారు. కేంద్ర బృందం జిల్లా పర్యటన నిమిత్తం అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తోలుత కారంచేడులో దెబ్బతిన్న పంట పొలాలు, కొమ్మురు కాలువకు గండి పడిన ప్రాంతం, స్వర్ణలో స్వర్ణ కాలువ పొంగి కొమ్మూరు కెనాల్లో కలిసిన ప్రాంతం పరిశీలించారు. కప్పల వాగు, పర్చూరు వాగులకు గండ్లు పడిన ప్రాంతాలు చూశారు. మొంథా తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాల పరిశీలనకు కేంద్ర బృందం పర్యటనకు సంబంధించి రూట్ మ్యాప్ తయారు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్సీ వెంకటరత్నం, డ్రైనేజీ ఈఈ మురళీకృష్ణ, తహశీల్దారు నాగరాజు, ఎంపిడిఒ కె నేతాజీ, ఇరిగేషన్, డ్రైనేజీ డిఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న ఫ్రెండ్స్

వైద్య ఖర్చులకు ఫ్రెండ్స్ సాయం

ప్రజాశక్తి - బాపట్ల

శ్వాసకోశ సమస్యతో ఇబ్బంది పడుతున్న పసికందు వైద్య ఖర్చులకు ఫ్రెండ్స్ యూత్ ఆర్గనైజేషన్ తమ వంతు ఆర్థిక సహాయం అందజేసినట్లు ఆర్గనైజేషన్ అధ్యక్షులు బండ్రెడ్డి గోపి తెలిపారు. పట్టణంలోని వెంగళ విహార్‌కు చెందిన ఆనంద్ దంపతులకు నాలుగు రోజులు క్రితం జన్మించిన బాబు శ్వాసకోస సమస్యతో వైద్యశాల్లో మెరుగైన చికిత్స అందించడం కోసం రూ.8 లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారని గోపి చెప్పారు. తమ వంతు సహాయంగా రూ.5వేలు ఆర్థిక సాయం అందించామని అన్నారు. దయగల దాతలు స్పందించి తమ వంతు సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు, కోశాధికారి జోగి సువర్ణరాజు, భీమా కోటేశ్వరరావు, యశం రాజా రమేష్, బొగ్గవరపు శివ, కరీం, శ్రీను పాల్గొన్నారు.

గుండెపోటుతో విఆర్‌ఒ మృతి

ప్రజాశక్తి - చీరాల

భూముల రీ సర్వేకు వెళ్లిన విఆర్‌ఒ పోతురాజు (46) గుండెపోటుతో మృతి చెందిన సంఘటన మండలంలోని బోయినవారిపాలెంలో సోమవారం జరిగింది. భూముల రీ సర్వే విధి నిర్వహణ నిమిత్తం బోయినవారిపాలెంలో సిబ్బందితో కలిసి పొలాన్ని రీ సర్వే చేస్తున్నారు. అయితే ఆ సమయంలో కాస్త అలసటగా ఉన్న ఆయన రీ సర్వే పత్రాలు పరిశీలిస్తూ ఒక్కసారిగా కుప్ప కూలి పోయాడు. తోటి సిబ్బందికి అసలు ఏం జరుగుతుందోనని తెలుసుకునే లోపే ఆయన అపస్మారక స్థితిలోకి చేరుకొని మృతి చెందారు. వెంటనే సహ ఉద్యోగులు చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించగా ఆపాటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గతంలో కూడా ఒకసారి గుండె పోటు వచ్చినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న తహశీల్దారు గోపికృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని విఆర్‌ఒ మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. విఆర్‌ఒ స్వగ్రామమైన పర్చూరుకు ఆయన మృత దాహాన్ని తరలించి ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లు చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. విఆర్‌ఒ పోతురాజు అంత్యక్రియలు మంగళవారం చేయనున్నట్లు బంధువులు తెలిపారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -రేపల్లె

సెలవు రోజుల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎంఇఒ కె సురేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నేతలు మాట్లాడారు. పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో పలు విద్యా సంస్థల్లో తరగతులు నిర్వహిస్తున్నారని అన్నారు. సాయంత్రం 5 తర్వాత రాత్రి 8.30వరకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో స్టడీ అవర్స్ జరుపుతున్నారని అన్నారు. వివిధ సందర్భాల్లో విద్యార్థులు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. తీవ్రమైన ఒత్తిడి వల్ల విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. సెలవు రోజుల్లో విద్యాసంస్థలు నడపకుండా అధికారులు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. లేకుంటే ఆయా విద్యా సంస్థలు ఎదుట ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈపాటికే స్టడీ అవర్స్ నడుపుతున్న శ్రీ చైతన్య, భాష్యం, నారాయణ, సెలవు

వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రోజుల్లో కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు రహస్యంగా తరగతులు నిర్వహిస్తు విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నారని అన్నారు. అటువంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఏరియా కార్యదర్శి ఎం సూర్య ప్రకాష్, అధ్యక్షులు జి కళ్యాణ్ బాబు, సహాయకార్యదర్శి వై నవీన్, నాయకులు ఎస్ ప్రశాంత్, పి సుమంత్, సిహెచ్ ఆనంద్, డి గౌతమ్, కె సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో ఆయిల్ కొరత

ప్రజాశక్తి - పర్చూరు

మండల కేంద్రమైన పర్చూరులో పెట్రోలు, డీజిల్ ఇంధన కొరత ఏర్పడింది. చీరాల రోడ్డులోని రెండు బంకుల్లో, చిలకలూరిపేట రోడ్డులోని ఆయిల్ బంకుల్లో పెట్రోల్ లేకపోవడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. రైతుల వ్యవసాయ సీజన్‌కు ప్రారంభం కావడంతో ట్రాక్టర్లకు ఆయిల్ లేకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. బైకులు, కార్లు ఆయిల్ కోసం బంకుల వద్దకు వెళ్లి లేదని చెప్పడంతో వెనుతిరిగి వెళుతున్నారు. వాహనదారులు పెట్రోలు బంకు వద్దకు వెళితే చాలని వెళ్లి అక్కడ లేదని చెప్పడంతో ఎటూపాలపోక దిక్కుతోచని స్థితిలో చిల్లర కొట్ల వద్ద డబ్బాల్లో మారుబేరానికి విక్రయిస్తున్న వాళ్లను వెతుక్కోవాల్సి వచ్చింది. ఆయిల్ డిస్ట్రిబ్యూషన్ పాయింట్ నుంచే ఆయిల్ రావడంలేదని బంకుల యజమానులు చెప్తున్నారు. ఆయిల్ కొరత ఏర్పడిందని బంకు నిర్వాహకులు చెబుతున్నారు. ఆయిల్ కృత్రిమ కొరత సృష్టించారా, లేక నిజంగా ఆయిల్ స్టాక్ పాయింట్ల వద్ద కొరత ఉందానేది తెలియాల్సి ఉంది. గత రెండు రోజులుగా దీనిపై చర్చ జరుగుతుంది.

అపరిచితులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

రైల్వేస్టేషన్లో అర్ధరాత్రి తనిఖీల్లో ఎస్పీ ఉమామహేశ్వర్

ప్రజాశక్తి- చీరాల

ఢిల్లీలో చోటుచేసుకున్న పేలుడు ఘటన నేపథ్యంలో జిల్లాలో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ఎస్పీ ఉమామహేశ్వర్ స్వయంగా రైల్వే స్టేషన్లో తనిఖీలు పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. రైల్వే స్టేషన్‌లో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ప్రత్యేక పోలీసు బలగాలతో కలిసి రైల్వే ప్లాట్‌ఫామ్‌లు, బస్సులు, ప్రయాణికుల సామాన్లు, వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎవరైనా అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తనిఖీల్లో డీఎస్పీ

తనిఖీలు చేస్తున్న ఎస్పీ ఉమామహేశ్వరరావు

మోయిన్, వన్‌టౌన్ సీఐ సుబ్బారావు, ఎస్ఐ రాజ్యలక్ష్మి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేరాల శివాలయం, సాయిబాబా గుడి సహా పలు దేవాలయాల్లో పోలీసులు సోదాలు చేశారు. ప్రధాన మార్గాల్లో వాహనాలు, పలు సినిమా హాళ్ళను తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని టూ టౌన్ సీఐ నాగభూషణం సూచించారు. ఒకటవ పట్టణ సీఐ సుబ్బారావు రైల్వే స్టేషన్, బస్టాండ్, పలు ట్రావెల్ బస్సుల్లో తనిఖీలు చేశారు.

నిరసన చేస్తున్న దళిత బహుజన నాయకులు

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - చీరాల

ప్రకాశం జిల్లా చీమకుర్తిలో దళిత సోదరులపై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలాని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక గడియార స్తంభం సెంటర్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత మంది అగ్రకుల పెత్తందారులు ఉద్దేశపూర్వకంగా దళితుల తో గొడవకు దిగి దాడి చేయడం అత్యంత దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో చలపతిరావు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు గుర్తింపు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎంపిడిఒ రవణ

రానున్న ఏడాదికి సంబంధించి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు గుర్తించేందుకు గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 11 నుండి 14వరకు గ్రామ సభలు జరుగుతాయని అన్నారు. పంచాయతీ కార్యాలయాల వద్ద జరిగే గ్రామ సభకు రైతులు హాజరై అవసరమైన పనులు గుర్తించి గ్రామ సభలో తెలియచేయాలని కోరారు. 11న కన్నెగంటివారిపాలెం, ఓలేరు, 12న సూరేపల్లి, కోనేటిపురం, 13న ఐలవరం, భట్టిప్రోలు, 14న రాచూరు, పల్లికోన, ఆళ్ళమూడి గ్రామాల్లో సభలు జరుగుతాయని తెలిపారు. ఈ గ్రామ సభలో రైతులు, గ్రామస్తులు ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా పనులు గుర్తిస్తే దానికి అనుగుణంగా రానున్న ఏడాదికి బడ్జెట్ కేటాయిస్తారని తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

పెదగాదెలవర్రు రోడ్డు అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలం పెదగాదెలవర్రు రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతూ సిపిఎం నాయకులు తహశీల్దారు డి నాగరాజారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు సిపిఎం నాయకులు బి అగస్టీన్ మాట్లాడుతూ చినపరిమి రోడ్డు గత 10ఏళ్లుగా పాడైపోయిందని తెలిపారు. ఈ రోడ్డులో ప్రయాణం అంటే నరక మేనని అన్నారు. ముఖ్యంగా చినపరిమి, చినగాదెలవర్రు, కారుమూరి వారిపాలెం, పెదగాదెలవర్రు గ్రామాల ప్రజలకు చుండూరు, తెనాలి వెళ్లాలంటే ఈ రోడ్డు తప్ప మరొదారి లేదని అన్నారు. విద్యార్థులు కాలేజీలకు వెళ్ళాలన్నా, పనుల నిమిత్తం, చుండూరు, తెనాలి బస్సు, ఆటోల్లో వెళ్లినా నడుములు కదిలి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత సంక్రాంతికే రోడ్లన్ని వేస్తామని ప్రకటించిన ప్రభుత్వం మళ్ళీ సంక్రాంతి రాబోతున్నా ఈ రోడ్డుకు మోక్షం కలగ లేదని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కంతేటీ శ్రీమన్నారాయణ, కుర్రి వెంకట రెడ్డి పాల్గొన్నారు.

బైకు అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

మార్టూరు సమీపంలోని బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని ఈమని గ్రామానికి చెందిన ఎనిగేటి శ్రీనివాసరావు, తిరుపతమ్మ దంపతులు వ్యక్తిగత పనుల నిమిత్తం నెల్లూరు వెళ్లారు. తిరిగి తమ స్వగ్రామం తెనాలి వెళుతుండగా బొల్లాపల్లి వద్ద ఒక్క సారిగా కుక్క అడ్డు రావడంతో బైకు అదుపుతప్పి శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డాడు. భార్య స్వల్ప గాయాలతో బైటపడింది. స్థానికుల సమాచారంతో హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి - చీరాల

ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు డీఎస్పీ మెయిన్, రూరల్ సీఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో ఈపురుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్ డ్రోన్ సర్వెలైన్స్ ద్వారా పేకాట ముఠాపై దాడి చేశారు. మండలంలోని నక్కలవారిపాలెం సమీపంలో పొలాల్లో జరుగుతున్న పేకాట శిభిరంలో 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రిశేఖర్ మాట్లాడుతూ గ్రామ శివారుల్లో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు డ్రోన్ కెమెరా సాయంతో స్థావరాన్ని గుర్తించి దాడులు చేశామని అన్నారు. ఈ దాడుల్లో 14 మంది పేకాటరాయుళ్ళను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,69,940 నగదు, 14 సెల్‌ఫోన్లు, మూడు మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని రమణాయపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత నిర్వహించారు. ఒంగోలు పిడిసిసి బ్యాంకు చైర్మన్ కె సీతారామయ్య, సీఈఒ డివి శర్మ, ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఆదేశాల మేరకు నాబార్డ్ ఆర్థిక సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత నిర్వహిస్తున్నట్లు కళాజాత కళాకారులు ఎడవల్లి వీరయ్య, ఎడవల్లి నాగేంద్ర తెలిపారు. పిడిసిసి బ్యాంకు ప్రజలకు అందిస్తున్న సేవలు, సేవింగ్ అకౌంట్స్, బంగారం, వ్యవసాయ రుణాలు, లాకర్ సదుపాయం వంటి సేవలను ప్రజలకు వివరిస్తూ రమణాయపాలెం, చెరుకూరు, కొత్తపాలెం గ్రామాల్లో కళాకారులు వివరించారు. బ్యాంకు సూపర్వైజర్ కె శ్రీనివాసరావు, సొసైటీ సిబ్బంది, కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారులు పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా నూతన కమిటీ

సిఐటియు ప్రకాశం జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-దర్శి

దర్శి పిఎస్ కళ్యాణ మండపంలో నిర్వహించిన సిఐటియు ప్రకాశం జిల్లా 13వ మహాసభల ముగింపు సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కాలం సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా ముప్పా రమేష్, కోశాధికారిగా పారా శ్రీనివాసరావుతో పాటు 23 మందితో జిల్లా ఆఫీసు బెరర్స్ని, మొత్తం 61 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు విలేఖరుల సమావేశంలో ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా జివి.కొండారెడ్డి, డికెఎం.రఫీ, తాండవ రంగారావు, పెంట్యాల కల్పన, బంకా సుబ్బారావు, ఈదర అన్నపూర్ణ, తంగిరాల మహేష్, టి.రాము, సిహెచ్.చీరంజీవి, కొరిసపాటి శ్రీనివాసరావు, కార్యదర్శులుగా గంటెనపల్లి శ్రీనివాసులు, పిసి.కేశవరావు, టి.ఆవులయ్య, పల్లామల్లి ఆంజనేయులు, పందిటి రూబేన్, జి.రమేష్, ఉబ్బా ఆదిలక్ష్మి, రాయళ్ళ మాలకొండయ్య, మక్కెన పరిశుద్ధం, కో ఆప్షన్ (అంగన్వాడీ) మొత్తం 23 మందితో నూతన ఆఫీసు బెరర్స్ ఎన్నికైనట్లు ఆయన ప్రకటించారు. కార్మిక, ఉద్యోగ, స్కీం వర్కర్స్ సమస్యలు, హక్కులపై సమరశీల పోరాటాలు చేయాలని తద్వారా సిఐటియు సంఘాలు, యూనియన్లు స్థాపించి దిశ, దశ మార్గం చూపించాలని పిలుపునిచ్చారు.

జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాలం సుబ్బారావు

కౌలు రైతులకు నష్టపరిహారమివ్వాలి

కేంద్ర బృందానికి కౌలు రైతుల సంఘం వినతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్, ఒంగోలు సిటీ

మొంథా తుపాన్ కారణంగా పంటలు నష్టపోయిన కౌలు రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కేంద్ర బృందాన్ని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య కోరారు. తుపాన్ నష్టాలను అంచనా వేసేందుకు సోమవారం ఒంగోలు వచ్చిన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి పౌసుమి బసు, ఆర్థిక మంత్రిత్వ శాఖ వ్యయ విభాగ డిప్యూటీ డైరెక్టర్ మహేష్ కుమార్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలకోటయ్య మాట్లాడుతూ అధిక వర్షాలతో జిల్లాలో సుమారుగా 25 వేల ఎకరాల పంటలు పత్తి, సజ్జ, మిర్చి మొదలైన పంటలు దెబ్బతిన్నాయన్నారు. సాగు చేసిన వారిలో ఎక్కువమంది కౌలు రైతులు ఉన్నారని, పంటల నష్టం కౌలు రైతుల పేర రాసి వారిని ఆదుకోవాలని కోరారు. పశ్చిమ ప్రాంతంలో కూడా బృందం పర్యటించాలని, నష్టం అంచనా వేయాలని పేర్కొన్నారు.

అర్జీ ఇస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

ఉగ్రకు అగ్ర తాంబూలం..!

- సిఎం పర్యటన ఖరారులో ఆ సమర్ధతే గీటురాయి
- రెండ్రోజుల్లో ఏర్పాట్లు చేయగలరనే పీసీపల్లి ఎంపిక

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

సిఎం చంద్రబాబు కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి అగ్రతాంబూలం ఇచ్చినట్లే.! ఎందుకంటే కేవలం రెండ్రోజుల్లోనే సిఎం పర్యటనకు ఏర్పాట్లు చేయగల సమర్థత ఆయనకు ఉందన్న విషయం గుర్తించే సిఎంఓ నుంచి ఇక్కడ సిఎం పర్యటనను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. పరిశ్రమల కేంద్రాలకు ప్రారంభోత్సవాలు చేయాలనే నిర్ణయం జరిగాక ఒక నియోజకవర్గం ఎంపిక చేయాల్సి ఉంది. పలు నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో సంప్రదింపులు జరిపాక ఎక్కడ పెట్టాలనే దానిపై సిఎంఓ నిర్ణయం తీసుకుంది. కనిగిరి ప్రాంతంలో పెడితే అంతా సజావుగా ఉంటుందని భావించారు. హఠాత్తుగా కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి శనివారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో అమరావతి నుంచి ఫోన్ వచ్చింది. సిఎం పర్యటన పెట్టాలని చెప్పారు. వెంటనే ఉగ్ర సరేనన్నారు. ఆదివారం ఉదయం పీసీపల్లి మండలం, లింగన్నపాలెం వద్ద ఎంఎస్ఎంఈ పార్కుకు అందరికన్నా ముందే చేరుకున్నారు. ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం వచ్చిన మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్రాజుతో కలిసి ఏర్పాట్లు చూశారు. అక్కడే సమీక్ష నిర్వహించారు. వీరంతా రాకముందే ఎమ్మెల్యే ఉగ్ర అక్కడకు యంత్రాలను తెప్పించి చదును చేయించారు. హెలిప్యాడ్, సభాస్థలం, వేదిక తదితర ఏర్పాట్లతో నిమగ్నమయ్యారు. సోమవారం నాడూ అక్కడే మకాం వేసి ఏర్పాట్లపై దృష్టి సారించారు. మరో వైపు నియోజకవర్గంలోని నేతలతోనూ చర్చించారు. ఎంపిక చేసిన సమీకరణకు అన్ని ఏర్పాట్లూ చేశారు. ఇటీవలే ఇదే ప్రాంతంలో మంత్రి లోకేష్ కూడా రిలయన్స్ బయో ఇంధన ప్లాంటుకు శంకుస్థాపన చేశారు. ఇపుడు అదే మండలానికి సిఎం చంద్రబాబు రావడం విశేషం. మంచి అవకాశం వచ్చినందున నియోజకవర్గ అభివృద్ధికి నిధులు రాబట్టుకుంటేనే సార్థకత చేకూరుతుందని గుర్తించాలి. సిఎం చంద్రబాబు కూడా కరువు సీమ కనిగిరి ప్రాంతానికి ఏమి ప్రకటిస్తారో.. ఏమి ఇస్తారో చూడాలి.

నష్టపోయిన రైతులను ఆదుకోండి

- ముంపుకు గురికాకుండా శాశ్వత చర్యలు
- కేంద్ర బృందానికి సిపిఎం జిల్లా కమిటీ వినతి

కేంద్ర బృందానికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్, ఒంగోలు సిటీ

'మొంథా' తుపాన్ కారణంగా కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన జిల్లా రైతులను ఆదుకోవాలని కేంద్ర బృందాన్ని సిపిఎం జిల్లా కమిటీ నేతలు కోరారు. తుపాన్తో నష్టపోయిన జిల్లా ప్రజలను ఆదుకోవాలని, భవిష్యత్లో ముంపుకు గురికాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని వారు కోరారు. తుపాన్ నష్టాలను అంచనా వేసేందుకు సోమవారం నలుగురు సభ్యులతో కూడిన కేంద్ర బృందం సోమవారం ఒంగోలు వచ్చింది. ఒంగోలు పిజిఆర్ఎస్ సమావేశ మందిరం వద్ద సిపిఎం జిల్లా కమిటీ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాబు మాట్లాడుతూ మొంథా తుపాన్ జిల్లా ప్రజలను తీవ్రంగా నష్టపరిచిందన్నారు. రెండు రోజుల్లో కురిసిన భారీ వర్షాలకు ముంపు సమస్య తీవ్రంగా ముందుకు వచ్చిందన్నారు. లోతట్టు ప్రాంతాలు నీటిలో మునిగాయని, వీటిపై తక్షణ అధ్యయనం అవసరమన్నారు. ముంపుకు కారణంపై పూర్తిస్థాయిలో పరిశీలన చేసి భవిష్యత్లో పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఒంగోలు నగరంలోనే 50 కాలనీలకు పైగా ముంపుకు గురయ్యాయని, రహదారులు చెరువును తలపించాయన్నారు. నీళ్ళు పోయే మార్గాలు మూసుకు పోవడంతో సంతనూతలపాడు, ఒంగోలు నియోజకవర్గాలలో ఇళ్ళు, పొలాలు ముంపునకు గురయ్యాయన్నారు. పశ్చిమాన పత్తి, మిర్చి, సజ్జ ఇతర పంటలకు భారీ నష్టం జరిగిందని, ప్రకాశం జిల్లా పరిధి 10,274 హెక్టార్లలో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసిందన్నారు. 16,506 మంది రైతులు బాధితులుగా తేల్చారని, పత్తి, మిర్చి పంటకు భారీ నష్టం జరిగిందన్నారు. ఎకరాకు ప్రాంతాలను బట్టి 50వేల నుండి లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టారని, అంతా నీటిపాలైందన్నారు. 8,087 హెక్టార్లలో పత్తి దెబ్బతిందన్నారు. ఈ మొత్తం పరిస్థితిని పరిశీలించాలన్నారు. తీవ్రంగా పంటలు నష్టపోయిన పశ్చిమ ప్రాంతంలో పర్యటన జరపాలని, నష్టపోయిన పంటలకు వెంటనే నష్టపరిహారం అందించాలన్నారు. ముంపుకు గురైన ప్రతి కుటుంబాన్నీ రీ సర్వే చేసి వారందరికీ నిత్యావసర వస్తువులతో పాటు రూ.10 వేలు ఆర్థిక సాయం చేయాలన్నారు. నగర పాలక సంస్థ కేవలం 1500 కుటుంబాలను మాత్రమే గుర్తించిందని, తమ పరిశీలనలో సుమారు 50 కాలనీలు, 10 వేల కుటుంబాలు ముంపునకు గురయ్యాయన్నారు. పోతురాజు కాల్వ, నల్లవాగుకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి నీటిపారుదలకు ఆటంకాలు లేకుండా చేయాలన్నారు. వివిధ కాలనీల నుంచి నీరు పోతురాజు కాల్వకు చేరేలా కాలువలు, కల్వర్టులు ఏర్పాటు చేయాలన్నారు. కొత్తపట్నం మండలం తేటుపురం, గుండమాల వద్ద నీరు సముద్రంలో చేరే మార్గాలను ఆక్రమించి రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారని, ఈ ఆక్రమణలను తొలగించాలన్నారు. మొంథా తుపాన్తో నష్టపోయిన రోడ్లు వెంటనే గుర్తించి తక్షణమే మరమ్మతులు చేయాలన్నారు. చిన్న పాటి వర్షాలకే రవాణా స్తంభనకు కారణమవుతున్న పాత బ్రిడ్జిలను గుర్తించి వాటి స్థానంలో కొత్త బ్రిడ్జిలను నిర్మించాలని, తుపాన్ కారణంగా మరణించిన వారి కుటుంబాలకు, నష్టపోయిన ఇళ్లు, పశు సంపదకు తక్షణమే నష్టపరిహారం అందించాలని కోరారు. కేంద్ర బృందాన్ని కలిసిన వారిలో పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు జివి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, ఎం. రమేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, జిల్లా కమిటీ సభ్యులు బి రఘురామ్ పాల్గొన్నారు.

ముంపు బాధితులకు తక్షణ సాయం అందించాలి

మొంథా తుపాను వల్ల ఒంగోలు నగరం తీవ్ర ముంపుకు గురై ప్రజల జీవనం స్తంభించిన నేపథ్యంలో, బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు అందించడంతోపాటు నగరంలోని దెబ్బతిన్న రోడ్లు, కాల్వలు, విద్యుత్ దీపాలు, పాఠశాల భవనాల పునరుద్ధరణకు కనీసం 20 కోట్లు విడుదల చేయాలని సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, నాయకులు సయ్యద్ హుస్సేన్ కేంద్ర బృందానికి వినతిపత్రం అందించారు.

ఏఎంఆర్పై గ్రానైట్ పరిశ్రమ ఆగ్రహం

- నెలన్నరగా మూతబడ్డ ఫ్యాక్టరీలు
- పండుగ వెళ్లినా వెనక్కురాని కార్మికులు
- రాయల్టీ వసూలులో నిమగ్నమైన ఏఎంఆర్
- ఆందోళనకు సిద్ధమవుతున్న యజమానులు

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రశాంతమైన నీటి ప్రవాహంలో బండరాయి పడ్డట్టు ప్రభుత్వానికి సీనరీ క్రమం తప్పకుండా చెల్లిస్తూ సాఫీగా సాగుతున్న గ్రానైట్ పరిశ్రమపై ఏఎంఆర్ కొట్టిన దెబ్బ ఫ్యాక్టరీ యజమానుల పాలిట శాపంగా మారింది. ఏఎంఆర్ ప్రతిపాదించిన అదనపు సుంకాలను చెల్లించడానికి ఫ్యాక్టరీ యజమానులు ససేమిరా అనడంతో 15 రోజులపాటు ఫ్యాక్టరీ యజమానులు సమ్మె నిర్వహించిన సంగతి పాఠకులకు తెలిసిందే. సమ్మె వల్ల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు 95 శాతం మంది స్వగ్రామాలకు తరలివెళ్లారు. తరలివెళ్లిన కార్మికులు దీపావళి పండుగ వెళ్లి పది రోజులు కావస్తున్నా.. ఇప్పటికీ తిరిగి రాలేదు. ఏఎంఆర్ ప్రతినిధులకు ఫ్యాక్టరీ యజమానులకు ఐదు దఫాలుగా జరిగిన చర్చలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఇరుపక్షాల మధ్య రాయల్టీ చెల్లింపు విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.35000 తప్ప అదనంగా

ఏఎంఆర్ సంస్థకు నయా పైసా కూడా చెల్లించమని ఫ్యాక్టరీ యజమానులు తెగేసి చెప్పారు. చర్చలు సఫలం కాకపోయినా ఏఎంఆర్ కంపెనీ వారు తమ పని తాము చేసుకుపోతున్నారు. చెక్ పోస్ట్ బాక్సుల్లో ఏర్పాటు, సీసీ కెమెరాలు ఏర్పాటు, సిబ్బంది రాయల్టీ వసూలులో నిమగ్నమై ఉన్నారు. అక్టోబర్ నెల 24వ తేదీన మైనింగ్ అధికారులతో ఏఎంఆర్ కంపెనీ ఒప్పందం ఖరారు చేసుకుంది. అదే రోజు నుంచి రాయల్టీ వసూలులో నిమగ్నం అయింది. రోడ్లపై నడిచే కంకర వాహనాలు, మట్టి వాహనాల నుంచి ఏఎంఆర్ ప్రతినిధులు రాయల్టీని ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఫ్యాక్టరీలలో కార్మికులు లేకపోవటం వల్ల పనులు పూర్తిస్థాయిలో స్తంభించిపోయాయి. స్లాబులు కొనుగోలు చేయడానికి బయ్యర్లు రావడం లేదు. మార్కర్లు రావటం లేదు. ఒకవేళ మార్కర్లు వచ్చినా ఫ్యాక్టరీలలో ఫినిషింగ్ మెటీరియల్ దొరకటం లేదు. కారణం కార్మికులు స్వస్థలాల నుంచి రాకపోవడమే.. ఉమ్మడి ప్రకాశం జిల్లావ్యాప్తంగా 2600 ఫ్యాక్టరీలు దాదాపు 4 లక్షల మంది కార్మికులు, ఉద్యోగులు, యజమానులు, ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడి గ్రానైట్ పరిశ్రమలు నమ్ముకొని జీవిస్తున్న వారి పరిస్థితి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఏఎంఆర్ సంస్థతో వచ్చిన సమస్యను అధ్యయనం చేసి రిపోర్ట్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం 16 మందితో కూడిన కమిటీని వేసింది. కమిటీ వారం రోజుల్లోగా అధ్యయనం చేసి సంబంధించిన నివేదికను సమర్పించాల్సి ఉంది. కమిటీ వేసి ఇప్పటికి నాలుగు రోజులైంది. అయితే క్షేత్రస్థాయిలో పరిశీలన జరగటం లేదు. కమిటీ కాలయాపన కోసమేనని యజమానులలో భావన నెలకొని ఉంది. గతంలో ఉన్న బ్లేడుకు రూ.27,000కు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ ఎనిమిది వేల రూపాయలు అదనంగా పెంచి మొత్తం రూ.35000 రాయల్టీ గా నిర్ణయించింది. పెంచిన రాయల్టీ తగ్గించకపోగా, అదనంగా రూ.30,000 చెల్లించమని అడుగుతున్నారు. ఏఎంఆర్ వలన గత నెల 15 రోజులుగా చీమకుర్తి ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమ మొత్తం స్తంభించిపోయింది. యజమానులు కార్మికులు దిక్కుతోచకున్నారు. ఒకవైపు చర్చలు మరోవైపు పరిశ్రమ ఆగిపోవడం వలన యజమానుల నెత్తిన పెరిగిపోతున్న బకాయిలతో యజమానులు అల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో రాయల్టీ వసూలు ప్రైవేటుపరం సమస్యను పరిష్కరించాలని, పెంచిన రాయల్టీని తగ్గించాలని, అదనపు రాయల్టీ వసూలు చేయరాదని ఆందోళన చేయడమే సరైన మార్గమని ఆలోచనలో ఉన్నారు. రేపోమాపో ఆందోళనకు దిగాలని ఫ్యాక్టరీ యజమానులు భావిస్తున్నట్లు తెలిసింది.